# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 22-11-2022 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 85 పేజీలు:6 వెల: రూ.1/-


## చార్మినార్‌కు బాంబు బెదిరింపు కాల్..

హైదరాబాద్, నవంబర్ 21: హైదరాబాదులోని చారిత్రక కట్టడం చార్మినార్ వద్ద బాంబు కలకలం చెలరేగింది. చార్మినార్ దగ్గర బాంబు పెట్టామని గుర్తు తెలియని ఆగంతకులు పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం బాంబ్ స్క్వాడ్ తో చార్మినార్ వద్ద విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

ఫుట్ పాత్ వ్యాపారులను ఖాళీ చేయించి బాంబు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తనిఖీల అనంతరం బాంబు లేదని బాంబ్ స్క్వాడ్ నిర్ధారణకు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఫేక్ కాల్ గా నిర్ధారించిన పోలీసులు కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై విచారణ చేపట్టారు. అది ఆకతాయిల కాల్ అయ్యుంటుందని పోలీసులు భావిస్తున్నారు.

## నాటి ఉద్యమాలకు కేంద్రాలు మన గ్రంథాలయాలు



హైదరాబాద్, నవంబర్ 21: నాటి ఉద్యమాలకు కేంద్రాలుగా మన గ్రంథాలయాలు ఎంతో దోహదపడ్డాయని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అలాంటి గ్రంథాలయాలకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో పూర్వ వైభవం వచ్చిందన్నారు. 55వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజ్ఞానదాయక సమాజం ఎదగాలంటే గ్రంథాలయాలు ఎంతో అవసరమన్నారు.

అలాంటి గ్రంథాలయాలను కాపాడుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పుస్తక పఠనం జీవితానికి నాణ్యతను జోడిస్తుందన్నారు. విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకుంటే, అది వారి భవిష్యత్‌కు మేధో కార్యకలాపంగా పని చేస్తుందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా జిల్లాలో లైబ్రరీలు సైతం రూపు మార్చుకుంటున్నాయన్నారు. జిల్లాలో ప్రతి మండలానికీ ఓ డిజిటల్ లైబ్రరీ ఉండేలా దాని సేవలు ప్రజలకు, పాఠకులకు అందేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటున్నదన్నారు. గ్రంథాలయాల నిర్మాణాల్లో చైర్మన్, సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు. త్వరలో సూర్యాపేటలో నూతన గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి విశాలంగా నిర్మిస్తామన్నారు. వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయమ న్నారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు మంత్రి జగదీశ్‌రెడ్డి బహుమతులు అందించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఉప్పల లలితాఆనంద్, కౌన్సిలర్లు తాహేర్ పాషా, నిమ్మల స్రవంతీశ్రీనివాస్, అనంతుల యాదగిరి, రాపర్తి శ్రీనివాస్, కుంభం రాజేందర్, డైరెక్టర్లు రియాజ్, కల్లేపల్లి మహేశ్వరి, సల్మా మస్తాన్, గ్రంథాలయ సెక్రటరీ సీతారామశాస్త్రి, శ్యాంసుందర్‌రెడ్డి, రంగారావు, భాస్కర్ పాల్గొన్నారు.

## ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ.



మహబూబాబాద్, నవంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామంలో ముదిరాజ్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామ సొసైటీ అధ్యక్షులు పసుల సోమయ్య ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దవంగర మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కనుకుంట్ల నరేష్ హాజరై వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా గలిగిన జాతి అంటే ముదిరాజ్ జాతి, అలాంటి ముదిరాజులకు మన రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ తో పాటు 50 సంవత్సరాలు నిండిన ప్రతి ముదిరాజ్ బిడ్డకు పెన్షన్ ఇచ్చే ఏర్పాటు చేసి ముదిరాజుల అభివృద్ధికి తోడ్పడాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ ప్రధాన కార్యదర్శి జిన్నే యాకయ్య, ఉపాధ్యక్షులు సోమసాని సోమేశ్ , పసుల శోభన్ బాబు, జిన్నే ఉపేందర్, జిన్నే శ్రీరాములు ,వట్టిపల్లి సోమన్న, అన్నెబోయిన ప్రవీణ్ ,మొగిలి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



(నవంబర్ 21 నటుడు ప్రేమనాథ్ జయంతి..)

సెల్:9494481210

## అందరికీ ఆరోగ్యం..అందుబాటులో ఉచిత వైద్య సేవలు...

-ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలు...

-దేశానికే ఆదర్శం మన తెలంగాణ రాష్ట్రం...

-వైద్య విద్య చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన ఘట్టం ఆవిష్కృతం...

- రాష్ట్రంలో 10 వేల సూపర్ స్పెషాలిటీ పడకల ఆసుపత్రి ఏర్పాటు దిశగా సర్కారు అడుగులు...

-2000 పడకల నిమ్స్ విస్తరణ ప్రాజెక్టుకు రూ. 1571 కోట్లతో పరిపాలన అనుమతులు...

-ఇప్పటికే నిమ్స్ లో 1800 పడకలు. 4 వేల పడకలతో నగరం నలువైపులా నాలుగు టిమ్స్, వరంగల్ లో 2000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మొత్తం 10,000 వేలకు చేరువగా సూపర్ స్పెషాలిటీ పడకలు...

-నిమ్స్ విస్తరణలో భాగంగా 2000 పడకలు. ఇందులో 500 ఐ సి యూ బెడ్స్, 42 విభాగాలు...

-అందుబాటులోకి రానున్న సూపర్ స్పెషాలిటీ నర్సింగ్, అనుబంధ హెల్త్ సైన్సెస్ ట్రైనింగ్...

-సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆరోగ్య తెలంగాణ దిశగా మరో అడుగు...

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆరున్నర దశాబ్దాల్లో ఆరోగ్య రంగంలో సాధ్యం కాని ఎన్నో రికార్డులను తెలంగాణ ప్రభుత్వం ఎనిమిదేళ్లలో సాధించింది. గౌరవ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గారి పాలనలో ఆరోగ్య తెలంగాణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. ఒకవైపు వైద్య విద్య మరో వైపు నాణ్యమైన వైద్య సేవలను రాష్ట్ర ప్రజలకు చేరువ చేస్తున్నది."ఆరోగ్య తెలంగాణ" రాష్ట్రాన్ని మన రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని మహిళలకు ఆశాకార్యకర్తలతో "ఏ షీల్డ్" టెస్ట్ కిట్ ద్వారా రక్తహీనత పరీక్షలు నిర్వహించి, రక్తహీనత గల వారికి మెడికల్, పారామెడికల్ సిబ్బందితో వైద్యసేవలను అందించడంతో పాటు న్యూట్రిషన్ ఆహారంపై అవగాహన కల్పించడం కోసం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు ప్రసవం వరకు తరచు రక్తహీనత పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించడం ఈ కార్యక్రమంలో ఒక భాగం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలలో, గ్రామాలలో హైరిస్క్ ఉన్న వారిని గుర్తించే కార్యక్రమాలు చేపట్టారు. వారికి మెరుగైన వైద్యసహాయం అందించడానికి ప్రధాన ఆసుపత్రులలో గైనకాలజిస్టు నిపుణులను నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలోని ప్రాథమిక ఆసుపత్రులను హైరిస్క్ కేసులకు వైద్యసహాయం అందించేలా చర్యలు చేపట్టారు.

### అనీమియా ముక్త్ దిశగా రాష్ట్రం అద్భుత ప్రగతి:

వైద్య శాఖ సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా కిశోర, గర్భిణిల ఆరోగ్యపరిస్థితులపై మెడికల్, పారామెడికల్ సిబ్బందితో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనీమియా,రక్తహీనత లోపం ఉన్నవారికి అవసరమైన మందులు అందిస్తున్నారు. ఆయా జిల్లాలలో 14 నుండి 55 సంవత్సరాలలోపు వారికి రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. కౌమారదశ బాలికలకు నెలసరిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అనీమియా విముక్తి జిల్లాలుగా తీర్చిదిద్దేలా కార్యక్రమాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్నది. అనీమియా ముక్త్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పర్చడానికి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా హైదరాబాద్ డైరెక్టర్ డా. సుభోద్ బృందంతో వైద్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో ఆయా జిల్లాలలో గర్భిణి స్త్రీలు, కిశోర బాలికల అరోగ్య పరిస్థితులు, వారికి అందిస్తున్న వైద్యసేవలపై వైద్య శాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రక్తహీనతపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ "ఏ షీల్డ్ యాప్" రూపొందించింది. ఆ యాప్ లో వైద్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేస్తారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి అనీమియా ముక్త్ కార్యక్రమం పర్యవేక్షిస్తున్నారు అనీమియా ముక్త్ కార్యక్రమం అమలు చర్యలు సమర్థవతంగా కొనసాగుతున్నాయి. కిశోరబాలికలు, తల్లులు, గర్భిణీ స్త్రీలకు క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలపై అధికారులు చేపట్టిన కార్యక్రమాల అమలు తీరు, పర్యవేక్షణపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా అధికారులు ఆయా జిల్లా కలెక్టర్లను అభినందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని చెప్పవచ్చు. స్వరాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందాలనేది మన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్. చిరకాల స్వప్నం. వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా 33 జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ఏడాది ప్రభుత్వ వైద్య కళాశాలలో అదనంగా 1150 సీట్లు సాధించి దేశ చరిత్రలోనే ఒక అడుగు ముందుకు వేసింది. 850 ఎంబిబిఎస్ సీట్ల స్థాయి నుంచి నేడు 2790 ఎంబిబిఎస్ సీట్లు పెంచుకోవడం మన రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం. సమాంతరంగా నర్సింగ్ కళాశాలలు, పారామెడికల్ కళాశాలలు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రంలో వైద్యవిద్య చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ దగిన ఘట్టమని, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. 57 సంవత్సరాల సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతంలో కేవలం 3 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నవి. స్వరాష్ట్రంలో గత 8 సంవత్సరాలలో 12 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రభుత్వం ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిద్దిపేట, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్, వనపర్తి, మంచిర్యాల, జగిత్యాల, సంగారెడ్డి, రామగుండం, మహబూబాబాద్ జిల్లాలలో వైద్య కళాశాలలో నేడు విద్య బోధన సదుపాయం ప్రజలకు కల్పించింది.

రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుతో ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్లి వైద్య విద్యను అభ్యసించవలసిన దుస్థితి తప్పింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదివే అవసరం లేకుండా స్వరాష్ట్రం లోనే వారి స్వప్నాలను సాకారం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఎంబిబిఎస్, పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్లు గణనీయంగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టి సంక్షేమ, రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ వైద్య కళాశాలలో యం.బి.బి.యస్ సీట్లు పొందడం గమనించదగిన విజయం. ఆ విద్యార్థులు ప్రతిభతో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సైతం రాణిస్తూ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు. మెడికల్ కళాశాలల్లో సీట్లు అధిక సంఖ్యలో పొందుతున్నారు. రాష్ట్ర ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య,ఆరోగ్య సదుపాయాలు అందించి ఆరోగ్య తెలంగాణ రాష్ట్రంగా రూపుదిద్దేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది.

## ఎమ్మెల్యేల కొనుగోలులో ముగ్గురు నిందితులకు మరో షాక్

న్యూ డిల్లీ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );నలుగురు తెలంగాణ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించిన ముగ్గురు నిందితులకు మరో షాక్ తగిలింది. బెయిల్ కోసం వారు చేసిన అప్పీల్ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం వెళ్లాలని ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ముగ్గురు నిందితులు - రామచంద్ర భారతి నంద కుమార్ మరియు సింహయాజి స్వామి బెయిల్ పిటిషన్ను కొట్టివేస్తూ హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోవడానికి న్యాయమూర్తులు బిఆర్ గవాయ్ విక్రమనాథ్లతో కూడిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. నిందితులు హైకోర్టులోనే రివ్యూ పిటిషన్ వేయవచ్చని ఈ దశలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది. తమపై ఉన్న కేసును రద్దు చేయాలంటూ నిందితులు చేసిన పిటిషన్ను ధర్మాసనం తోసిపుచ్చింది. కాగా హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కేసును విచారిస్తున్న హైదరాబాద్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సింహయాజీకి విమాన టిక్కెట్టు బుక్ చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బంధువు శ్రీనివాస్ను విచారించడం ప్రారంభించింది. నిందితుల్లో ఒకడికి సహాయం చేసినందుకు శ్రీనివాస్ ను విచారించింది. మరో ముగ్గురు అనుమానితులైన బీఎల్ సంతోష్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. భారత ధార్మిక జనసేన (బీడీజేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు తుషార్ వెల్లపల్లి మాతా అమృతానందమయి ఆశ్రమానికి చెందిన డాక్టర్ జగ్గు స్వామి సోమవారం సిట్ ఎదుట విచారణకు హాజరుకాలేదు. హైదరాబాద్లోని పోలీస్ హెడ్క్వార్టర్స్లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లోని సిట్ ఎదుట నవంబర్ 21వ తేదీ ఉదయం 10:30 గంటలకు హాజరుకావాలని సిట్ నవంబర్ 16న సంతోష్కు నోటీసులు జారీ చేసింది. అయితే బీఎల్ సంతోష్ సిట్ ఎదుట హాజరుకావడం లేదు. సంతోష్ ఢిల్లీలో లేనందున ఢిల్లీ పోలీసుల ద్వారా అందజేయాల్సిన నోటీసు అందలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో సహకరించాలని ఢిల్లీ పోలీసులను కోర్టు ఆదేశించింది. సిట్ ఏకపక్షంగా అక్రమంగా నోటీసులు జారీ చేస్తోందని ఆరోపిస్తూ నవంబర్ 18న బీజేపీ గతంలో కోర్టును ఆశ్రయించింది. అందుకు అంగీకరించని కోర్టు బీఎల్ సంతోష్ను ఇక్కడి పోలీసులు అరెస్ట్ చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ స్క్రిప్ట్ దర్శకత్వం వహించిన డ్రామా అని అభివర్ణించిన బిజెపి.. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను వేటాడటం ఆరోపణలపై విచారణకు సిబిఐ వంటి తటస్థ ఏజెన్సీ విచారణ కోరింది. అయితే సీవీ ఆనంద్ నేతృత్వంలోని సిట్ను హైకోర్టు పర్యవేక్షిస్తుందని కోర్టు పేర్కొంది. సిట్ దర్యాప్తు ఫలితాలను కోర్టుతో మాత్రమే పంచుకోవాలని రాజకీయ కార్యవర్గం లేదా మీడియాతో పంచుకోవద్దని కోరింది. సెక్షన్ 41 కింద సిట్ నోటీసు ఇవ్వవచ్చని కోర్టు పేర్కొంది కాబట్టి సంతోష్ తప్పనిసరిగా సిట్ ముందు హాజరు కావాలి అయితే అతని అరెస్టుపై పరిమితి ఉంది. పోలీసులు ఏం చేస్తారన్నది తెలియాల్సి ఉంది.

## ఇండోనేషియా భూకంపం.. 46కు పెరిగిన మృతులు



జకార్తా : ఇండోనేషియాలో జక్తారాలో సోమవారం భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. భారీ ప్రకంపనల ధాటికి పెద్ద సంఖ్యలో భవనాలు నేలకూలగా.. పెద్ద ఎత్తున పగుళ్లు బారాయి. ప్రకంపనలతో 46 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మందికిపైగా గాయపడ్డట్లు సమాచారం. ప్రస్తుతం అందిన సమాచారం మేరకు.. ఒకే ఆసుపత్రిలో 46 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తున్నది. రిక్టర్ స్కేల్‌పై 5.6 తీవ్రతతో జకార్తాలో భూకంపం సంభవించిందని జియోఫిజిక్స్ ఏజెన్సీ పేర్కొంది.

పశ్చిమ జావాలోని సియాంజూర్‌లో భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు తెలిపింది.

భారీ ప్రకంపలతో కార్యాలయాల్లో నుంచి ఉద్యోగులు, ఇండ్ల నుంచి జనం బయటకు పరుగులు పెట్టారు. ఇదిలా ఉండగా.. పశ్చిమ ఇండోనేషియాలో గత శుక్రవారం రాత్రి భారీ భూకంపం సంభవించగా.. భూకంప తీవ్రత 6.9గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. అయితే, తీవ్రంగానే ప్రకంపనలు వచ్చినా ఎలాంటి నష్టం జరుగకపోవడం విశేషం కానీ. ఇవాళ 5.6 తీవ్రతతో వచ్చిన భూకంపం ధాటికి భారీగా ఆస్తి, ప్రాణనష్టం సంభవించింది.

## మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు: మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, నవంబర్ 21: ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో చేపల పెంపకం పరిశ్రమగా అభివృద్ధి చెందిందని, నీలి విప్లవం కొనసాగుతున్నదని చెప్పారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. కాకతీయులు, రెడ్డి రాజులు అందించిన చెరువులను సుసంపన్నం చేసి, రిజర్వాయర్ల నిర్మాణంతో జలకళను తెచ్చి రాష్ట్ర జీవికను సుస్థిరం చేశారన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మత్స్యసంపదను పెంచేందుకు విశేషమైన కృషి జరుగుతుందన్నారు.

మత్స్య సంపద వల్ల రాష్ట్రంలోని 30 లక్షల మంది మత్స్యకారులు లబ్ధిపొందుతున్నారని, ఇప్పటికే 23 వేల చెరువులను జియోట్యాగింగ్ చేశామని వెల్లడించారు. నీటి సంపదను పెంచి చేప పిల్లలను ఉచితంగా ఇచ్చి, వాటిని పెంచడానికి పరికరాలను అందించి మత్స్య సంపదనను ముఖ్యమైన ఆదాయ వనరుగా మార్చామని, తద్వారా మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని తెలిపారు.

## 2030 లోపే మానవులు చంద్రుడిపై జీవించడానికి అవకాశం: నాసా



చందమామపై నివాసం ఉండటం కోసం ఎప్పటి నుంచో మానవులు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. భూమి విపరీతంగా వేడెక్కడం (గ్లోబల్ వార్మింగ్) ఇతర వాతావరణ పరిస్థితులు తదితర కారణాలతో కొన్నేళ్లకు భూమిపై కొన్ని ప్రాంతాల్లో సురక్షిత జీవనం సాధ్యం కాదన్న అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మానవుడు వేరే గ్రహాలపైన తన ఆవాసం ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ.. నాసా సంచలన విషయాన్ని వెల్లడించింది. 2030 లోపే మానవులు చంద్రుడిపై జీవించడానికి అవకాశం ఉందని సంతోషకరమైన విషయాన్ని చెవిన వేసింది.

ఆర్టెమిస్ రాకెట్ విజయవంతంగా ప్రయోగించాక ఈ దశాబ్దం ముగిసేలోపు మానవులు చంద్రునిపై నివసించవచ్చని నాసా అధికారి ఒకరు తాజాగా తెలిపారు. ఈ క్రమంలో 2030కి ముందే మానవులు చంద్రునిపై చురుగ్గా పని చేసుకోవచ్చని చెప్పారు. మానవులకు సహాయం అందించడానికి రోవర్లు ఉంటాయని ఓరియన్ లూనార్ స్పేస్క్రాఫ్ట్ ప్రోగ్రామ్ హెడ్ హోవార్డ్ హు వెల్లడించారు. కాగా సాంకేతిక సమస్యలు హరికేన్ తుపానులతో ఆర్టెమిస్ ప్రయోగం ఆలస్యమైందని తెలిపారు. ఈ మిషన్ విజయవంతమైతే తదుపరి ఆర్టెమిస్ 2 ఆర్టెమిస్ 3 ప్రయోగాలకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. ఈ రెండూ చంద్రుని మీద మనుషులు జీవించడానికి ఎంతగానో ఉపయోగపడనున్నాయని నాసా అధికారి వివరించారు.

అలాగే భవిష్యత్తులో వ్యోమగాములు జీవించడానికి చంద్రునిపై అంతరిక్ష కేంద్రం అయిన లూనార్ గేట్వే నిర్మాణానికి అభివృద్ధికి ఆర్టెమిస్ తోడ్పడనుంది. మరోవైపు ఓరియన్ క్యాప్సూల్ డిసెంబర్ 11న భూమిపైకి రానుంది. ఈ ప్రయోగం అమెరికాకు మాత్రమే కాకుండా యావత్ ప్రపంచం దీర్ఘకాలిక అంతరిక్ష అన్వేషణకు మొదటి అడుగు అని ఓరియన్ లూనార్ స్పేస్క్రాఫ్ట్ ప్రోగ్రామ్ హెడ్ హోవార్డ్ హు అభివర్ణించడం విశేషం. తొలిసారిగా 1969లో అమెరికాకు చెందిన వ్యోమగామి నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై కాలు మోపిన సంగతి తెలిసిందే. మళ్లీ 50 ఏళ్ల విరామం తర్వాత ఇప్పుడు చంద్రుడి మీదకు మళ్లీ మనుషులను పంపించటానికి నాసా శ్రీకారం చుడుతోంది. ఈసారి ఈ మూన్ మిషన్కు 'ఆర్టిమిస్ ప్రోగ్రామ్' అని నాసా నామకరణం చేసింది.

## సీఎస్‌తో తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీ



హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర సీఎస్ సోమేశ్ కుమార్ తో సమావేశమయ్యారు. ఈ మేరకు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సీనియర్ నేతలు జగ్గారెడ్డి, అజారుద్దీన్ లు సీఎస్ ను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నేతలు వినతిపత్రం అందజేశారు. ధరణిని రద్దు చేసి పాత విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిషేధిత జాబితాలో పొరపాటుగా నమోదైన భూముల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అర్హులకు అసైన్డ్ భూములు పట్టాలు ఇవ్వాలని టీకాంగ్రెస్ నేతలు వినతిపత్రంలో పేర్కొన్నారు.




# హరిత శక్తి విప్లవంతోనే సుస్థిర వెలుగులు

భారతావని బొగ్గు కొరతతో విద్యుత్తు సంక్షోభపు అంచున నిలబడి ఉంది. దేశంలోని 135 బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లలో సగానికి పైగా ప్లాంట్లలో బొగ్గు కొరత రానున్నది. పవర్ ప్లాంట్లలో అవిచ్ఛిన్నంగా విద్యుత్ ఉత్పత్తి జరగడానికి ఇంధనంగా బొగ్గు లేదా గ్యాస్ అందాల్సి ఉంది. భారీగా విద్యుత్ వినియోగం పెరగడం, బొగ్గు టన్ను ధర 60 నుంచి 200 డాలర్లకు పెరగడంతో ఉత్పత్తి పడిపోవడంతో పాటు 16 ప్లాంట్లు మూతపడడం, మరో 30 ప్లాంట్లు తాళాలు బిగించే దిశగా వెళుతున్న వేళ విద్యుత్తు ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతో ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాలు చీకటి అంచు నిలబడనున్నాయి. దేశవ్యాప్తంగా 1.36 లక్షల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి నిలిచి పోయింది. బొగ్గు ధర పెరిగితే విద్యుత్ ఉత్పత్తి ధరలు, చమురు ధరలు, కరెంటు చార్జీలతో పాటు అన్ని నిత్యవసరాల ధరలకు రెక్కలు వస్తాయి. ఈ కరెంటు కష్టాలు మరో 6 నెలలు వెంటాడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనితో ద్రవ్యోల్బనంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. బొగ్గు, గ్యాస్ వినియోగంతో వాతావరణ ప్రతికూల మార్పులు జరుగుతున్నాయి. ఈ తరుణంలో దేశం మరో హరిత విప్లవం 2.0 రూపంలో సాంప్రదాయేతర తరగని ఇంధనాల ఉత్పత్తి పట్ల సత్వరమే దృష్టి సారించి విద్యుత్ సంక్షోభాన్ని శాశ్వతంగా తొలగించడానికి వడివడిగా అడుగులు వేయాల్సి ఉంది.

పర్యావరణ ప్రతికూల శిలాజ ఇంధనాల వినియోగం:

భారతంలో దాదాపు 70 శాతం పెట్రోలియం చమురు ఉత్పత్తులు, బొగ్గు, గ్యాస్ లాంటి సాంప్రదాయ శిలాజ ఇంధన వనరుల వినియోగం జరుగుతోంది. ప్రపంచంలోనే అధిక బొగ్గు వినియోగిస్తున్న దేశాల్లో భారత్ కూడా ఉన్నది. మన దేశపు అవసరాలకు తగిన బొగ్గు నిల్వలు దాదాపు 300 ఏండ్ల వరకు అందుబాటులో ఉన్నప్పటికీ సప్లై-డిమాండ్ అంతరంతో దిగుమతులు జరుగుతున్నాయి. బొగ్గు వినియోగంతో కార్బన్ ఉద్గారాలు పెరుగుతూ అధిక గాలి కాలుష్యం, భూతాపం, వాతావరణ ప్రతికూల మార్పులు జరిగి మానవాళి ఆరోగ్యాన్ని హరిస్తాయి. బొగ్గు, చమురు, గ్యాస్ లాంటి తరిగే పర్యావరణ ప్రతికూల ఇంధనాల వినియోగాలకు ప్రత్యామ్నాయంగా తరగని, సాంప్రదాయేతర పునరుత్పాదక (రిన్యువబుల్) ఇంధనాలను వినియోగంలోకి తేవడానికి ప్రభుత్వాలు పథక రచనలు చేస్తున్నాయి. సౌరశక్తి, పవన శక్తి, టైడల్ ఎనర్జీ (అలల శక్తి) లాంటి శక్తి వనరులను తక్షణమే అధిక మె?త్తంలోఅన్వేషించాల్సి సమయం ఆసన్నమైంది. రాష్ట్ర ప్రభుత్వాలు, కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు ఆసక్తి చూపకపోవడంతో పర్యావరణహిత తరగని సాంప్రదాయేతర శక్తి ఉత్పత్తులు తగినంతగా పెరగడం లేదు.

## హరిత శక్తి విప్లవం 2.0 తక్షణావసరం:

పర్యావరణహిత తరగని శక్తి వనరులను అధిక మె?త్తంలో వెలికి తీయడానికి మరో హరిత శక్తి విప్లవం 2.0 (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రెవొల్యూషన్ 2.0) రావలసి ఉంది. 2022 నాటికి 175 గిగావాట్స్ (జిడబ్ల్యూ) శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, అంచనాలను అందుకోవడం అసాధ్యంగానే తోస్తున్నది. నేడు 100 జిడబ్ల్యూ హరిత శక్తి(గ్రీన్ పవర్)ని మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. రిలియన్స్ కంపెనీ రూ: 75,000 కోట్లను వెచ్చించి నాలుగు ఫ్యాక్టరీలను నెలకొల్పి హరిత సౌర శక్తి నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు అమలు చేస్తున్నది. హరిత శక్తి ఉత్పత్తి కంపెనీలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రూ: 4,500 కోట్లను సబ్సిడీల రూపంలో కేటాయించింది. ఇండియాలోని పరిస్థితులు 1,000 జిడబ్ల్యూ హరిత శక్తి ఉత్పత్తికి సహకరిస్తాయని అంచనా. పారిస్ ఒప్పందం అమలు జరిగితే ఆర్థిక వ్యవస్థ 2030 నాటికి 26 ట్రిలియన్ డాలర్లకు చేరి, 24 మిలియన్ల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. అదానీ కంపెనీ యాజమాన్యం రానున్న 10 ఏండ్లలో 20 బిలియన్ డాలర్లను వెచ్చించి హరిత శక్తి ఉత్పత్తి, రవాణ, పంపిణీ చేయనున్నది. టాటా కంపెనీ యాజమాన్యం రానున్న రోజుల్లో బొగ్గు ఆధారిత ప్లాంట్ల స్థాపనకు చరమగీతం పాడుతూ, హరిత శక్తి ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున చేపట్టనున్నది. అనేక కంపెనీలు, స్టార్ట్అప్‌లతో పాటు హరిత శక్తి విప్లవం 2.0 వైపు ఉత్సాహంగా అడుగులు వేస్తున్నాయి. ప్రభుత్వరంగ యన్‌టిపిసి, ఐఓసి కంపెనీలు సౌరశక్తి, పవనశక్తి ఉత్పత్తికి చొరవ తీసుకుంటున్నాయి.

## అత్యాధునిక హరిత శక్తి విప్లవం 2.0 రూపాలు:

తరగని సాంప్రదాయేతర ఇంధన పర్యావరణహిత సౌరశక్తి, పవనశక్తి, అలల శక్తితో పాటు హైడ్రోజన్ ఇంధనం, బయోమాస్, శరీర ఉష్ణం, వ్యర్థ ఆల్కహాల్ లాంటి వనరులను వినియోగించి అధిక హరిత శక్తిని ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఇటీవల యుయస్ కంపెనీ హైదరాబాద్‌లో హరిత శక్తి ఉత్పత్తి నిమిత్తం రూ: 5,000 కోట్లను వెచ్చిస్తున్నట్లు తెలిపింది. ఇన్ఫోసిస్, రీన్యూ, విక్రమ్ సోలార్, వారీ ఎనర్జీస్ లాంటి పలు కంపెనీలు హరిత శక్తి విప్లవం 2.0లో ప్రధాన భూమికను పోషించనున్నాయి. ప్రస్తుతం ఇండియాలో 234 జిడబ్ల్యూ (61 శాతం) థర్మల్ ఎనర్జీ, 99 జిడబ్ల్యూ (25 శాతం) పునరుత్పాదక తరగని శక్తి, 46 జిడబ్ల్యూ (12 శాతం) జల విద్యుత్తు, 6.7 జిడబ్ల్యూ (2 శాతం) అణువిద్యుత్తు ఉత్పత్తి జరుగుతున్నది. 2030 నాటికి ఇండియాలో ప్రస్తుత 43 శాతం నుంచి 66 శాతం వరకు సౌరశక్తి ఉత్పత్తి పెంచాలని నిర్ణయించారు. హరిత శక్తి విప్లవం 2.0 అమలులో భాగంగా 2022 నాటికి 175 జిడబ్ల్యూ, 2024 నాటికి 225 జిడబ్ల్యూ, 2030 నాటికి 450 జిడబ్ల్యూ పర్యావరణహిత శక్తిని ఉత్పత్తి చేయాలని ప్రణాళికలు వేశారు.

భారత దేశం శిలాజ ఇంధనాల దిగుమతులను నిలిపి వేసి హరిత శక్తి వనరులను అభివృద్ధి చేస్తూ, ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరాలని కోరుకుందాం. హరిత శక్తి వనరులు భవిష్యత్తు ఇంధన అత్యవసరాలని మరువరాదు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు, నివాసయేగ్య వాతావరణానికి, మహమ్మారులను మట్టు పెట్టడానికి, జీవకోటి పరిరక్షణకు హరిత శక్తి విప్లవం 2.0ను పెద్ద ఎత్తున చేపట్టాలని, సూర్యుడి శక్తిని ఒడిసి పట్టి మానవాళి సుఖజీవనానికి దారులు వేయాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఇండియన్ రేసింగ్ లీగ్‌తో రోడ్లు బ్లాక్

### రద్దీ ప్రాంతంలో రేసింగ్..
### ముందస్తు ప్రణాళికలో పోలీసుల వైఫల్యం

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ రేసింగ్ లీగ్ నేపథ్యంలో పోలీసులు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఖైరతాబాద్ నుంచి వచ్చే వాహనాలు ట్యాంక్‌బండ్ ఎక్కకుండా, ఐమాక్స్, రోటరీ వైపు వెళ్లకుండా క్లోజ్ చేశారు. దానికి కనెక్టివిటీగా ఉన్న మింట్ కాంపౌండ్ రోడ్డును కూడా మూసి వేశారు. షాదన్ నిరంకారి, ఓల్డ్ సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ఇక్బాల్ మినార్ మీదుగా తెలుగు తల్లి ఫ్లై ఓవర్‌పైకి మళ్లించారు. హిమాయత్‌నగర్ లిబర్టీ వైపు నుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ చౌరస్తా నుంచి ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ మీదుగా అసెంబ్లీ చౌరస్తా వైపు మళ్లించారు.

సికింద్రాబాద్ వైపు నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా ఇందిరాపార్కు వద్ద యూ టర్న్ పెట్టి మళ్లించారు. ఇలా ట్రాఫిక్ మళ్లింపులతో శనివారం సాగర తీరం చుట్టు పక్కల రోడ్లన్నీ ట్రాఫిక్ జామ్‌తో కిక్కిరిసిపోయాయి. ఖైరతాబాద్, పంజాగుట్ట, రవీంద్ర భారతి, లిబర్టీ, లక్డీకాపూల్, ముషీరాబాద్, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.కాగాఈ కార్ రేసింగ్ వంటి పెద్ద ఈవెంట్‌ను నగరం నడిబొడ్డున నిర్వహించడం ట్రాఫిక్‌పై పెద్ద ఎత్తున ప్రభావం చూపుతోందని వాహనదారులు వాపోతున్నారు. చుట్టుపక్కల రోడ్లన్నీ రోజంతా మూసివేయడంతో శనివారం విపరీతమైన ట్రాఫిక్‌లో చిక్కుకుని నరకం చూశామన్నారు. రూ. కోట్లు ఖర్చుచేసి రేసింగ్ ట్రాక్ నిర్మించిన అధికారులు ట్రాఫిక్ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించకపోవడం ట్రాఫిక్ పోలీసుల వైఫల్యమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# హామీలు నెరవేర్చని కేంద్ర ప్రభుత్వం .. మరో ఉద్యమానికి సిద్ధమవుతున్న రైతులు

న్యూఢిల్లీ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు నిరసనలు చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచిన రైతులు మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 11న హర్యానా, ఢిల్లీ సరిహద్దు ప్రాంతమైన సింగు వద్దకు భారీగా తరలి రానున్నారు. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌తోపాటు ప్రతి చోట నుంచి రైతులు ఇక్కడకు చేరుకుంటారని సంయుక్త కిసాన్ మోర్చా సభ్యుడు అభిమన్యు తెలిపారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాదిపాటు జరిపిన పోరాటంలో అసువులు బాసిన రైతులకు నివాళి అర్పిస్తామని చెప్పారు. ఆ తర్వాత భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కాగా, గత ఏడాది డిసెంబర్‌లో వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్న కేంద్ర ప్రభుత్వం రైతులకు హామీలు ఇవ్వడంతో నిరసనలను విరమించి ఇళ్లకు చేరామని అభిమన్యు తెలిపారు. అయితే ఏడాది అవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏవీ కూడా నెరవేరలేదన్నారు. రైతులకు ప్రధానమైన కనీస మద్దతు ధర అంశంపై కేంద్రం వెనక్కి తగ్గుతోందని ఆయన విమర్శించారు. అలాగే రైతులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేస్తామన్న కేంద్రం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సరిహద్దుల్లో మరోసారి ఉద్యమించేందుకు రైతులు సిద్ధమవుతున్నారని ఆయన వెల్లడించారు.

# అనంతగిరి ఘాట్ రోడ్డులో అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా:ఒకరి మృతి




వికారాబాద్ నవంబర్ 21 )ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అనంతగిరి ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళా ప్రయాణికురాలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. బ్రేకులు ఫెయిల్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# వైసీపీ ఎంపి విజయసాయి రెడ్డి ఫ్యామిలీకి తలనొప్పిగా మారిన ఢిల్లీ లిక్కర్ స్కాం

విజయవాడ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఢిల్లీలో బయటపడిన లిక్కర్ స్కాం ప్రకంపనలు రెండు తెలుగురాష్ట్రాల్ని బలంగా తాకుతున్న సంగతి తెలిసిందే. చూసేందుకు తెలంగాణలో మాత్రమే ఉన్నట్లు కనిపించినా.. లోతులు.. వాటి జాడలు మాత్రం ఏపీ వద్దకు ఆగుతున్నట్లుగా చెబుతున్నారు. రాజకీయ ప్రత్యర్థులపై అదే పనిగా విరుచుకుపడే వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి ఫ్యామిలీకి ఢిల్లీ లిక్కర్ స్కాం పెద్ద తలనొప్పిగా మారుతోంది. ఈ ఎపిసోడ్ తో పాత విషయాలు.. ఇప్పటికి పెద్దగా ప్రచారంలో లేని కొత్త విషయాలు తెర మీదకు వస్తున్నాయి. అవన్నీ కలిసి విజయసాయిని మరింత ఇరిటేట్ చేసేలా మారుస్తున్నాయన్న మాట వినిపిస్తోంది. తాజాగా విజయసాయి రెడ్డి ఫ్యామిలీని వేలెత్తి చూపించేలా పరిస్థితి మొదలైంది. దీనికి కారణం విజయసాయి రెడ్డి ఒక్కగానొక్క అల్లుడి అన్న మరెవరో కాదు.. శరత్ చంద్రారెడ్డి. అవును.. అరబిందో ఫార్మాకు డైరెక్టర్ గా వ్యవహరించిన ఆయన.. ఏపీ క్రికెట్ అసోసియేషన్ కు అధ్యక్షుడన్న విషయం తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ప్రస్తుతం అరెస్టులో ఉన్న ఆయన్ను ఈడీ ప్రశ్నిస్తోంది. ఇదిలా ఉంటే.. ఒక స్కాంలో నిందితుడిగా ఉన్న వ్యక్తిని ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష స్థానంలో ఎలా ఉంచుతారు? అన్న ప్రశ్న తెర మీదకు వస్తోంది. అదే సమయంలో.. ఏపీ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవి సైతం విజయసాయి రెడ్డి అల్లుడికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం కావటాన్ని వేలెత్తి చూపిస్తున్నారు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ లో అధ్యక్ష స్థానం.. ఉపాధ్యక్ష స్థానం రెండూ విజయసాయి రెడ్డి ఫ్యామిలీ చేతిలో ఉండటమా? అన్న విస్మయం తాజాగా వ్యక్తమవుతోంది. తాజాగా జరిగే ఎపెక్స్ ఎన్నికల్లో శరత్ చంద్రారెడ్డిని అధ్యక్షుడిగా.. ఉపాధ్యక్షుడిగా అల్లుడు రోహిత్ రెడ్డి.. విజయసాయికి అత్యంత సన్నిహితంగా ఉండే గోపీనాథ్ రెడ్డి (విశాఖకు చెందిన వ్యాపారవేత్త) కార్యదర్శి పదవికి.. ఇతర సన్నిహితులు కూడా బోర్డులోకి రానున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కాలేదు. కానీ.. దీనికి సంబంధించి ఇప్పటివరకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. దీంతో.. ఎన్నిక లాంఛమని చెబుతున్నారు. వచ్చే మూడేళ్లు ఏపీ క్రికెట్ అసోసియేషన్ ను విజయసాయి ఫ్యామిలీనే ఏలబోతున్నట్లుగా చెబుతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. క్రికెట్ సంఘం ఎన్నికల అధికారిగా వైఎస్ కు అత్యంత సన్నిహితుడు.. ఆయన సీఎంగా వ్యవహరించిన సమయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించినప రమాకాంత్ రెడ్డిని నియమించటం గమనార్హం.

క్రికెట్ సంఘాలపై రాజకీయ పెత్తనం మామూలే అయినా.. ఏపీలో మాత్రం అది పరాకాష్ఠ స్థాయికి చేరుకుందన్న మాట ఇప్పుడు అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఇవన్నీ ఇప్పుడు విజయసాయికి కొత్త తలనొప్పిగా మారాయి. ఈ విషయాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా.. కుటుంబంలో విజయసాయికి ఇబ్బందికి గురి చేస్తుందన్న మాట వినిపిస్తోంది.

# ఘనంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు



తిరుపతి నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు కన్నుల పండువగా జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా తొలిరోజు ఉదయం 9.45 గంటలకు మిథున లగ్నంలో అర్చకుల వేదమంత్రోచ్చారణ మధ్య ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సుప్రభాతం నిర్వహించి యాగశాలలో గజపట ప్రతిష్ఠ కంకణభట్టార్ మణికంఠ బట్టర్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణ ఘట్టంలో మొదటగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం , షోడషోపచారాలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి అభిషేకం తరువాత బ్రహ్మోత్సవాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని దేవతలను ప్రార్థిస్తూ రక్షాబంధనం చేశారు. ఈ సందర్భంగా ఈవో ఎ వి ధర్మారెడ్డి మాట్లాడుతూ కరోనా కారణంగా రెండు సంవత్సరాల తర్వాత అమ్మవారి వాహన సేవలు బయట నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం, సాయంత్రం వాహన సేవలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో దంపతులతో పాటు , జెఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో కార్మికులు, ప్రజా సమస్యలపై నిర్బంధం

### -సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ అసహనం



తిరుపతి నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీలో కార్మికులు, ప్రజా సమస్యలపై నిర్బంధంపై ఇది ప్రజా ప్రభుత్వమేనా? అన్న అనుమానంగా ఉందని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాలగౌడ అన్నారు. ఆదివారం తిరుపతిలో సిఐటియు ఆధ్వర్యంలో "ప్రజా ఉద్యమాలు-నిర్బంధం"పై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ, సిఐటీయు రాష్ట్ర అధ్యక్షుడు సి. హెచ్.నరసింహారావు హాజరయ్యారు. ఈ గోపాలగౌడ మాట్లాడుతూ ఏపీలో ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా నడవడం లేదని విమర్శించారు. పోలీసు నిర్బంధాలపై కోర్టులలో కేసులు వేయాలని కార్మిక సంఘాలకు సూచించారు. పోలీసులు చట్టం ప్రకారం నడుచు కోవాలన్నారు. సీఆర్పీసీ, ఐపీసీ ఉల్లంఘనపై పోలీసు అధికారులపై కోర్టులకు ఎందుకు పిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. కార్మిక హక్కుల ఉల్లంఘనపై కోర్టు తలుపు తట్టడంలో తప్పు లేదన్నారు. పౌరునిగా ఉన్న ప్రాథమిక హక్కులు రాజ్యాంగ వ్యవస్థ కల్పించిందని, పోలీసు వ్యవస్థ అందుకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులు పనిచేయకపోతే దేశ అభివృద్ధి జరగదని, అలాగే ప్రభుత్వాలు వారి హక్కులను కాలరాయకూడదన్నారు. రైతులు, కార్మికులు ఈ దేశానికి చాలా అవసరమన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఆందోళనను పోలీసులు అణగదొక్కడం సిగ్గుచేటని, పోలీసు వ్యవస్థ పరిధికి మించి వ్యవహరించకూడదని మాజీ జస్టిస్ గోపాలగౌడ వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో కమ్మ వర్గానికి అన్యాయం : మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు

అమరావతి: నవంబర్ 21:రాష్ట్రంలో సీఎం జగన్ కమ్మ వర్గానికి అన్యాయం చేస్తున్నారని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు ఘాటైన వ్యాఖ్యలు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో నిర్వహించిన కమ్మవారి వనభోజనాల కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరయ్యారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో ఆయన నివాసంలో మాజీ మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నేను ఎన్టీఆర్ మంత్రి వర్గంలో మంత్రిగా పని చేసిన.. ఆయన మంత్రి వర్గంలో వారిని ఎంతో గౌరవించే వారు అన్నారు. ఎన్టీఆర్ వర్సిటీ ప్రారంభంలో నేను పాల్గొన్నాను అక్కడ శిలా ఫలకాల మీద నాపేరు, ఎన్టీఆర్ పేరు, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి పేరు ఇప్పటికీ ఉన్నాయన్నారు. కాని వ్యవస్థల పేర్లు మార్చిన చరిత్ర గతంలో లేదు. ఎన్టీఆర్ వర్సిటీ పేరు మార్పు విషయంలో ఎవరూ స్పందించకపోవడం శోచనీయం మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు మండిపడ్డారు. ఏపీ కేబినెట్ లో కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. కమ్మవారి రాష్ట్రం అయ్యిండి, ఇక్కడ ఒక్క మంత్రి కూడా లేకపోవడం పక్కా రాష్ట్రాల్లో కమ్మవారికి ఎంతో మందికి మంత్రి పదవులు ఉన్నాయి అన్నారు.

# యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధికి భక్తుల తాకిడి



యాదాద్రి భువనగిరి నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు దినం తోపాటు కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. బ్రేక్ దర్శనానికి సైతం భక్తులు అధిక సంఖ్యలో వెళ్లారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లడ్డు ప్రసాదం కౌంటర్లు,సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కల్యాణ కట్ట ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకుని దీపారాధన పూజల్లో పాల్గొంటున్నారు

# ఇంటర్ ప్రవేశాల గడువును మరోసారి పొడిగింపు

### -నవంబర్ 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించొచ్చు

హైదరాబాద్ నవంబర్ 21(ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ఇంటర్ ప్రవేశాల గడువును మరోసారి పొడిగిస్తూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ కాలేజీల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలకు మరోసారి అవకాశం కల్పించింది. అర్హత గల విద్యార్థులు నవంబర్ 27వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో ప్రవేశాలు పొందొచ్చు. ఇంటర్ పబ్లిక్ ఎగ్జామ్స్‌కు సంబంధించి పరీక్ష ఫీజు స్వీకరణ కొనసాగుతుంది. నవంబర్ 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించొచ్చు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు గతంలో ఫెయిలైన విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించొచ్చని బోర్డు తెలిపింది. వచ్చే ఏడాది మార్చిలో ఇంటర్ వార్షిక పరీక్షలను నిర్వహించనున్నారు. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులు రూ. 500 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సైన్స్ గ్రూపుల విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షల నిమిత్తం అదనంగా రూ. 210 చెల్లించాల్సి ఉంటుంది. ఒకేషనల్ విద్యార్థులు రూ. 710 చెల్లించాలి. రూ. 100 ఆలస్యం రుసుంతో డిసెంబర్ 2 నుంచి 6వ తేదీ మధ్యలో చెల్లించొచ్చు. రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 8 నుంచి 12వ తేదీ మధ్యలో చెల్లించొచ్చు. రూ. 1000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 14 నుంచి 17వ తేదీ వరకు, రూ. 2000 ఆలస్య రుసుంతో డిసెంబర్ 19 నుంచి 22వ తేదీ మధ్యలో చెల్లించొచ్చని అధికారులు పేర్కొన్నారు.

కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ, కడప
42-169, యన్.జి.ఓ. కాలనీ, వై.యస్.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్: 9177013845, 9849351604, 08562-253734
అలపర్తి పిచ్చయ్య చౌదరి
వ్యవస్థాపక అధ్యక్షులు
పత్రికా ప్రకటన
డాక్టర్ కవిత స్మారక జాతీయ సాహిత్య పురస్కారాలు
2022-23 సంవత్సరానికి కవిత విద్యాసాంస్కృతిక సేవాసంస్థ జాతీయ సాహిత్య పురస్కారాలకు ప్రకటిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, కోశాధికారి శ్రీమతి బోయపాటి దుర్గాకుమారిగార్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.
ఈ సంవత్సరానికి - కందుకూరి నవలా పురస్కారం - ఎమ్.ఆర్. అరుణకుమారి (చిత్తూరు) 'కన్నీటి చేవ్రాలు'; గురజాడ కథాపురస్కారం - భండారు విజయ (హైదరాబాద్) 'గణిక' ; శ్రీశ్రీ కవితాపురస్కారం - పద్మావతి రాంభక్త (విశాఖపట్నం) కొత్తవేకువ ; జానమద్ది సాహిత్య పురస్కారం - ఆచార్య కిన్నెర శ్రీదేవి (కుప్పం) 'కథ' -విమర్శ; డా॥ రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారం- సమ్మెట ఉమాదేవి (సికింద్రాబాద్)'మా పిల్లల ముచ్చట్లు' గార్లను ఎంపిక చేయడం జరిగింది.
పురస్కార గ్రహీతకు రూ.5000/- నగదు బహుమతి, శాలువా, సన్మానంతో పెద్దల సమక్షంలో సత్కరిస్తాము. ఎంపిక కాబడిన రచయిత్రులకు మొత్తము రూ.25,000/-లు నగదు బహుమతి అందజేయబడుతుంది.
2022 డిసెంబర్ 4వ తేది ఆదివారం ఉదయం 10 గం॥లకు విజయవాడ - గాంధి నగర్‌లోని యన్.జి.ఓ.హోమ్ భవనంలో ప్రముఖుల సమక్షంలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించబడుతుందని కవిత విద్యసాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తెలిపారు.

ఎమ్.ఆర్. అరుణకుమారి (చిత్తూరు) 'కన్నీటి చేవ్రాలు'
కందుకూరి నవలాపురస్కారం
భండారు విజయ (హైదరాబాద్) 'గణిక'
గురజాడ కథాపురస్కారం
కిన్నెర శ్రీదేవి (కుప్పం) 'కథ' - విమర్శ
జానమద్ది సాహిత్య పురస్కారం - విమర్శ
సమ్మెట ఉమాదేవి (సికింద్రాబాద్) 'మా పిల్లల ముచ్చట్లు'
డా॥ రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారం
పద్మావతి రాంభక్త (విశాఖపట్నం) 'కొత్తవేకువ'
శ్రీశ్రీ కవితా పురస్కారం
(అలపర్తి పిచ్చయ్యచౌదరి)
అధ్యక్షులు, కవిత విద్యాసాంస్కృతిక సేవా సంస్థ, కడప

# త్వరలో ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ భర్తీ పూర్తి: మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్ నవంబర్ 21(ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్రంలో విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని కొందరు కుహానా మేధావులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మహంతి ఆడిటోరియంలో పీఆర్‌టీయూఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ కూర రఘోత్తమరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి.. హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. త్వరలో రిక్రూట్‌మెంట్ భర్తీ పూర్తి చేస్తామని, ఉద్యోగుల విషయంలో ఫ్రెండ్లీ గవర్నమెంట్.. టీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్య వచ్చినాయి ఇప్పటి వరకు టీఆర్ఎస్ ప్రభుత్వమే పరిష్కరించిందన్నారు. త్వరలో ఎంప్లాయీస్ హెల్త్ కార్డు విషయంలో నిర్ణయం తీసుకోబోతున్నామన్నారు.

# వాస్తవిక సామర్థ్యాన్ని తెలుసుకొనేటట్టు చేయడంలో సాయపడడం ఒక గౌరవాన్నిచ్చే విషయం: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 21:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిన్నటి రోజు న తాను ప్రారంభించిన అభి వృద్ధి కార్యక్రమాల ను ప్రజల ప్రశంసించినందుకు గాను ట్విటర్ లో బదులిచ్చారు. ప్రధాన మంత్రి నిన్న ఈటానగర్ లో డోనీ పోలో విమానాశ్రయాన్ని ప్రారంభించడం తో పాటు గా 600 మెగా వాట్ సామర్థ్యం కలిగినటువంటి కామెంగ్ జల విద్యుత్తు కేంద్రాన్ని దేశ ప్రజల కు అంకితం చేశారు.

ఈశాన్య ప్రాంతాల లో వాయు సంధానం లో చోటు చేసుకొన్న భారీ వృద్ధి ని గురించి ప్రధాన మంత్రి వ్యాఖ్యానిస్తూ, ఇలా అన్నారు.

"అవును.. ఇది ఈశాన్య ప్రాంతాల కు సంబంధించినంతవరకు చూస్తే, ఇది ఒక పెద్ద మార్పే. ఇది అధిక సంఖ్య లో పర్యటకులు సందర్శించడానికి వీలు కల్పిస్తుంది; అంతేకాకుండా ఈశాన్య ప్రాంతాల ప్రజల కు దేశం లోని ఇతర ప్రాంతాల కు ప్రయాణించడం లో సౌలభ్యాన్ని ప్రసాదిస్తుంది కూడాను."

ఒక పౌరుడు రాష్ట్రం యొక్క అభి వృద్ధి విషయం లో ప్రధాన మంత్రి యొక్క నిబద్ధత ను గురించి ప్రముఖం గా ప్రకటించగా, దాని కి శ్రీ నరేంద్ర మోదీ సమాధానాన్ని ఇస్తూ,

'అరుణాచల్ ప్రదేశ్ ప్రజలు అసాధారణమైనటువంటి వారు. వారి దేశ భక్తి భావన అచంచలమైందిగా ఉంటుంది. ఈ గొప్ప రాష్ట్రం కోసం పనిచేయడం మరియు ఈ రాష్ట్రం యొక్క వాస్తవిక సామర్థ్యాన్ని తెలుసుకొనేటట్టు చేయడం లో సాయపడడం అనేది ఒక గౌరవాన్వితమైనటువంటి విషయం." అని పేర్కొన్నారు.

# 26న నింగిలోకి పీఎస్ఎల్వీ సీ-54



నెల్లూరు నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ నెల 26న పీఎస్ఎల్వీ సీ-54 ప్రయోగం చేపట్టనున్నది. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలోని స్పేస్‌సెంటర్ రాకెట్‌ను నింగిలోకి పంపనున్నది. ఓషన్‌శాట్-3 సహా ఎనిమిది నానో ఉపగ్రహాలను సీ-54 రాకెట్ కక్షలో ప్రవేశపెట్టనున్నది. శనివారం ఉదయం 11.56 గంటలకు ప్రయోగం చేపట్టనున్నట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి. ఓషన్‌శాట్-3తో పాటు భూటాన్ శాట్, ఆనంద్, ధ్రువ స్పేస్ నుంచి రెండు థైబోల్ట్ శాటిలైట్లను, నాలుగు ఆస్ట్రోకాస్ట్ శాటిలైట్లను ఇస్రో నింగిలోకి పంపనున్నది.ఓషన్‌శాట్ భూ పరిశీలన ఉపగ్రహం కాగా.. ఇప్పటికే ఓషన్‌శాట్ సిరీస్‌లో ఓషన్‌శాట్-1, ఓషన్‌శాట్-2 ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. ప్రస్తుతం ఈ సిరీస్‌లో మూడో ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. సముద్రం, వాతావరణాన్ని అధ్యయనం చేస్తూ.. తుఫానుల అంచనా వేయడానికి ఓషన్‌శాట్ సిరీస్ శాటిలైట్స్ ఉపయోగపడుతున్నాయి. ఇదే సిరీస్‌లో ఓషన్‌శాట్-3ఏ ఉపగ్రహాన్ని వచ్చే ఏడాదిలో నింగిలోకి పంపనున్నట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి.

# రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి కొప్పుల దంపతులు

కరీంనగర్, నవంబర్ 21:కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా సుప్రసిద్ధ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రి కొప్పుల దంపతులకు అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు, జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, ఈ.ఓ కృష్ణ ప్రసాద్ తోపాటు పలువురు ఉన్నారు.



# ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అభిషేక్ బోయినపల్లిది కీలక పాత్ర: ఈడీ

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశ రాజధాని ఢిల్లీ సహా రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తున్న ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ఈడీ మరిన్ని విషయాలను వెల్లడించింది.ఈ స్కామ్ లో అభిషేక్ బోయినపల్లిది కీలక పాత్ర అని సీబీఐ ప్రత్యేక కోర్టు కు ఈడీ పేర్కొంది. వైసీపీ ఎంపీ బంధువు అరబిందో ఫార్మా కంపెనీ డైరెక్టర్ పి. శరత్ చంద్రారెడ్డి భాగస్వామిగా ఉన్న సౌత్ గ్రూప్ నుంచి దాదాపు రూ.100 కోట్ల ముడుపులు చెల్లించడంలో అభిషేక్ బోయినపల్లి కీలకంగా వ్యవహరించారని తమ దర్యాప్తులో తేలినట్లు వివరించింది. మొత్తం ముడుపుల్లో రూ.50 కోట్లను హైదరాబాద్ నుంచి ఢిల్లీకి హవాలా మార్గంలో తరలించినట్లు స్పష్టం చేసింది. ఈ కేసులో వందల కోట్ల రూపాయలు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి చేరినట్లు కోర్టుకు ఈడీ వివరించింది. అభిషేక్ బోయినపల్లి ఐదురోజుల ఈడీ కస్టడి ముగిసిన నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. "ఈ ఐదు రోజుల్లో నిందితులిద్దరిని విచారించాం. ఇందా లోతుగా విచారించాల్సి ఉంది. మరో 9 రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వండి" అని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.అంతేకాదు శరత్ చంద్రారెడ్డి కంపెనీకి చెందిన సీఈవో చందన్ రెడ్డి హైదరాబాద్కు చెందిన ఆడిటర్ బుచ్చిబాబుతో అభిషేక్ను ముఖాముఖి కూర్చోబెట్టి విచారించాల్సి ఉందని కోర్టుకు వివరించారు. దీంతో న్యాయమూర్తి మరో ఐదు రోజుల పాటు కస్టడీకి ఇచ్చారు. ఇదిలావుంటే ఈ కుంభకోణంలో తెలంగాణకు చెందిన ఓ ముఖ్యనేత చుట్టూ సీబీఐ ఉచ్చు బిగుస్తోంది. ఆ నేత ఢిల్లీ మాజీ మంత్రి సోమనాథ్ భారతి పలు మార్లు భేటీ అయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కు చెందిన ఎన్నారై షరీప్ ఈ బేటీల్లో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. దీంతో ఈ ముగ్గురి పాత్రపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

తెలంగాణకు చెందిన సదరు ముఖ్యనేత పలుమార్లు విమానాల్లో ఢిల్లీకి వచ్చినట్లు ఏఏఐ తన నివేదికలో పేర్కొన్నట్లు సీబీఐ వర్గాలు భావిస్తున్నాయి. ఆ నేత అనుచరులు ఢిల్లీలో మద్యం వ్యాపారంలోకి ప్రవేశించడానికి సోమనాథ్ భారతి మార్గం సుగమం చేశారనే ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. మొత్తంగా ఈ కుంభ కోణంలో ఢిల్లీ పాత్ర కన్నా తెలంగాణ పాత్రే ఎక్కువగా ఉందని సీబీఐఈడీలు ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. మరి మున్ముందు ఏం జరుగుతుందో చూడాలి.

# కర్ణాటకలో ఉగ్రదాడి.. ఆటోలో పేలుడు ఇద్దరు మృతి



బెంగళూర్ నవంబర్ 21(ఎక్స్ ప్రెస్ న్యూస్ ) బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్రంలో ఉగ్రవాద దాడి జరిగినట్టు ఆ రాష్ట్ర డీజీపీ ప్రవీణ్సూద్ తెలిపారు. కదులు తున్న ఆటోలో ఒక్కసారిగా పేలుడు సంభవించిందని దీంతో వాహనంలో మంటలు చెలరేగి దట్టంగా పొగ కమ్ముకుందని అన్నారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సహా మరో ప్రయాణికుడు మృతి చెందినట్లు చెప్పారు. కర్ణాటకలోని మంగళూరులో జరిగిన ఈ ఘటన పై సమగ్ర విచారణ జరుగుతోందని తెలిపారు.

అయితే ఇప్పటికి ఈ ఘటన ప్రమాదం కాదని తేల్చినట్టు డీజీపీ చెప్పారు.

ఇందులో ఉగ్రకోణం ఉందని ప్రవీణ్ సూద్ స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అంతేకాదు మంగళూరు పేలుళ్లలో కోయంబత్తూరు పేలుళ్లకు లింక్ బయటపడిందని ఆయన చెప్పారు.

శనివారంరాత్రి సంభవించిన ఈ ఘటనపై ఆదివారం తెల్లవారుజామున ఎన్ఐఏ బృందం దర్యాప్తును వేగవంతం చేసేందుకు పేలుడు స్థలానికి చేరుకుందని డీజీపీ వివరించారు. కర్ణాటకలోని మంగళూరులో రద్దీగా ఉండే రోడ్డు వద్ద శనివారం కదులుతున్న ఆటోరిక్షాలో పేలుడు సంభవించింది ఇది ప్రమాదవశాత్తు కాదు ఇది ఉగ్ర చర్య అని ఆయన ధృవీకరించారు. ప్రెషర్ కుక్కర్ బాంబు పేలడంతో రిక్షా డ్రైవర్ మరియు ప్రయాణీకుడు ఇద్దరు వ్యక్తులు మృతి చెందారన్నారు.ఈ ఘటనలో ఆటోరిక్షా డ్రైవర్కు ఎలాంటి పాత్రా లేదని ప్రయాణికుడు నకిలీ ఆధార్ కార్డును కలిగి ఉన్నాడని కర్ణాటక డీజీపీ ధృవీకరించారు. 'ఇది ఇప్పుడు ధృవీకరించబడింది. పేలుడు ప్రమాదవశాత్తు కాదు తీవ్ర నష్టం కలిగించే ఉద్దేశ్యంతో జరిగిన టెర్రర్ చర్య. దీనిపై కేంద్ర ఏజెన్సీలతో పాటు కర్ణాటక రాష్ట్ర పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు' అని కర్ణాటక డీజీపీ సూద్ తెలిపారు

# ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2022 గా 'మెగాస్టార్' చిరంజీవి

న్యూఢిల్లీ, నవంబర్ 21:ప్రముఖ తెలుగు నటుడు శ్రీ చిరంజీవిని ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2022 గా గుర్తించామని కేంద్ర సమాచార ప్రసార, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ ప్రకటించారు. చలన చిత్ర రంగానికి శ్రీ చిరంజీవి అందించిన సేవలకు గుర్తింపుగా జీవన సాఫల్య అవార్డు బహూకరిస్తామని శ్రీ ఠాకూర్ ప్రకటించారు. 53 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభ వేడుకల్లో శ్రీ ఠాకూర్ చిరంజీవికి జీవన సాఫల్య అవార్డు ప్రధానం చేస్తామని అన్నారు. చిరంజీవి నాలుగు శతాబ్దాలుగా చలన చిత్ర రంగానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. 150కి పైగా చిత్రాల్లో చిరంజీవి నటించారని శ్రీ ఠాకూర్ అన్నారు.

చిరంజీవి గుర్తింపు పొందిన భారతీయ నటుడు, డాన్సర్, చలన చిత్ర నిర్మాత, పరోపకారి, ఒక రాజకీయవేత్త. ప్రధానంగా తెలుగు సినిమాల్లో నటించిన చిరంజీవి హిందీ, కన్నడ, తమిళ సినిమాల్లో కూడా నటించారు' అని శ్రీ ఠాకూర్ వివరించారు. పద్మభూషణ్, రఘుపతి వెంకయ్య అవార్డు, నంది లాంటి అనేక అవార్డులను చిరంజీవి అందుకున్నారని తెలిపిన . ప్రేక్షకుల అభిమానం చిరంజీవికి మెగాస్టార్ గుర్తింపు తెచ్చిందని శ్రీ ఠాకూర్ అన్నారు.

1978లో 'పందిరిల్లు' సినిమాతో చిరంజీవి చలన చిత్ర రంగంలో ప్రవేశించారు. 1982 లో చిరంజీవి 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' సినిమాతో సామాన్య ప్రజల హీరోగా మారారు. సినిమాల్లో చిరంజీవి డాన్సులు, ఫైటింగ్ దృశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకర్షిస్తాయి. వివిధ సంస్థల ద్వారా చిరంజీవి సమాజానికి సేవలు అందిస్తున్నారు. 1998లో ఆయన చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నెలకొల్పారు.

తొమ్మిది రోజుల పాటు జరిగే చలన చిత్రోత్సవాలను కేంద్ర సమాచార,ప్రసార, యువజన వ్యవహారాలు,క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సినిమా నిర్మాణ, నిర్మాణ అనంతర కార్యక్రమాలకు భారతదేశం కేంద్రంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని శ్రీ ఠాకూర్ తన ప్రారంభ ఉపన్యాసంలో పేర్కొన్నారు. దేశంలో అపారంగా ఉన్న శక్తి సామర్థ్యాలు, వినూత్నంగా ఆలోచించే మేధస్సు, పరిశ్రమ సహకారంతో లక్ష్యాన్ని చేరుకుంటామని శ్రీ ఠాకూర్ ప్రకటించారు. ' ఐఎఫ్ఎఫ్ఐ ఒక కార్యక్రమ నిర్వహణకు పరిమిత కాకూడదు. భారతదేశం తన స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో ఐఎఫ్ఎఫ్ఐ తన కార్యక్రమాలను విస్తృతం చేయాలి. అమృత్ మహోత్సవ్ నుంచి అమృత కాలంలోకి భారతదేశం అడుగుపెడుతోంది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ ఉత్సవాలను పెద్ద సంఖ్యలో నిర్వహించి సినిమా రూపకల్పన, నిర్మాణం రంగాల్లో భారతదేశం ప్రపంచంలో అగ్ర స్థానంలో సాధించాలి అన్న లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది" అని శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ వివరించారు.

తాను స్వయంగా రూపొందించిన ' 75 క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' కార్యక్రమం కార్యాచరణ ప్రణాళికను శ్రీ ఠాకూర్ వివరించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది ఒక ఆలోచన శక్తిని గుర్తిస్తుందని శ్రీ ఠాకూర్ తెలిపారు. ఆలోచనలకు పదును పెట్టి తమ లక్ష్యాలు, ఆశయాలు సాధించేలా యువతను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఆజాదీ కా అమృత్ ఉత్సవ్ వేడుకల్లో భాగంగా ప్రసార సమాచార మంత్రిత్వ శాఖ ' 75 క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' కార్యక్రమాన్ని ప్రారంభించింది.

వసుధైక కుటుంబం స్ఫూర్తిగా ఐఎఫ్ఎఫ్ఐ :

తన ప్రసంగంలో శ్రీ ఠాగూర్ ఆసియాలో అతిపెద్ద చలన చిత్ర ఉత్సవంగా గుర్తింపు పొందిన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల చరిత్రను ప్రస్తావించారు. 1952 నుంచి అంతరాయం లేకుండా వసుదైక కుటుంబం స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రపంచం ఒక కుటుంబంలా శాంతితో పరిఢవిల్లాలి అన్నది భారతదేశ ఆకాంక్ష అని మంత్రి వ్యాఖ్యానించారు. ' ఒక ప్రపంచం, ఒక కుటుంబం, అందరికి ఉజ్వల భవిష్యత్తు అన్నది జీ 20 అధ్యక్ష హోదాలో పనిచేస్తున్న భారతదేశం సిద్ధాంతమని శ్రీ ఠాకూర్ అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో తమ ప్రభుత్వం లక్ష్య సాధన దిశలో సాగుతున్నదని శ్రీ ఠాకూర్ పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన విధంగా 53 వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఇండియన్ పనోరమ, ప్రపంచ సినిమా, నివాళులు, గత స్మృతులు విభాగాలతో పాటు భారత చిత్రాల ప్రీమియర్ ప్రదర్శన, విదేశీ చిత్రాలు, ఓటీటీ వేదికలు నిర్మించిన కొత్త సిరీస్ లను ప్రదర్శిస్తామని శ్రీ ఠాకూర్ వివరించారు. చిత్ర నిర్మాణానికి సహకరించిన నటులు కూడా ఉత్సవంలో పాల్గొంటారు. ఇజ్రాయెల్ దేశానికి చెందిన ప్రముఖ నటుడు ఈ ఉత్సవంలో పాల్గొంటారని అన్నారు. జాతీయ చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన ఫిల్మ్ బజార్ పెవిలియన్‌లు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ మల్టీమీడియా ఎగ్జిబిషన్ మరియు '75 క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో' కోసం 53-గంటల ఛాలెంజ్ లాంటి అనేక ఇతర కార్యక్రమాలు ఉత్సవంలో భాగంగా నిర్వహిస్తామని మంత్రి తెలియజేశారు.

ఆస్ట్రియా దేశానికి చెందిన "అల్మా ఆస్కార్''తో ప్రదర్శనతో చలన చిత్రోత్సవాలు ప్రారంభం కావడం పట్ల శ్రీ ఠాకూర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సత్యజిత్‌రే లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును గెలుచుకున్నందుకు ప్రముఖ స్పానిష్ చిత్ర నిర్మాత కార్లోస్ సౌరాను మంత్రి అభినందించారు. "శ్రీ. సౌరా 6 దశాబ్దాలకు పైగా సినిమాలు తీస్తున్నారు. 90 సంవత్సరాల వయస్సులో కూడా చలన చిత్ర రంగంలో సౌరా చురుకుగా కొనసాగుతున్నారు. సౌరా తన జీవితకాలంలో అనేక అవార్డులు మరియు నామినేషన్లను గెలుచుకున్నారు. సౌరా తరపున ఆయన కుమార్తె అన్నా సౌరా అవార్డును 53వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో స్వీకరిస్తారు.' అని ఠాకూర్ అన్నారు. ఐఎఫ్ఎఫ్ఐ తో పాటు నిర్వహిస్తున్న ఫిల్మ్ బజార్ ప్రాధాన్యతను శ్రీ ఠాకూర్ వివరించారు. "ప్రపంచ సినిమా రంగం అనుసంధానానికి ఫిల్మ్ బజార్ ఒక గొలుసుగా పనిచేస్తుంది. 'సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ' లో కీలకమైన లింక్ గా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా కొనుగోలుదారులు మరియు అమ్మకందారులు ఫిల్మ్ బజార్ ద్వారా ఒక వేదికపైకి వస్తారు. చలనచిత్ర నిర్మాణం, పంపిణీలో అన్ని దేశాలు ముఖ్యంగా దక్షిణాసియా దేశాలు దీనివల్ల ప్రయోజనం పొందుతాయి. చిత్ర నిర్మాతలకు తమ పనిని పరిచయం చేయడానికి మరియు వారి చిత్రాలలో చిత్రీకరించబడిన అంశాలను లోతుగా చర్చించడానికి ఫిలిం బజార్ ఒక ప్రత్యేక వేదిక అందిస్తుంది,' అని శ్రీ ఠాకూర్ వివరించారు. "మొదటిసారిగా, ఐఎఫ్ఎఫ్ఐ కంట్రీ పెవిలియన్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ఫిల్మ్ బజార్ పరిధిని పెంచింది. 15వ ఫిల్మ్ బజార్ లో 40కి పైగా పెవిలియన్‌లు ఏర్పాటు అయ్యాయి. సినిమా ప్రపంచం నుండి సరికొత్త ఆవిష్కరణలను ప్రదర్శించడానికి తొలిసారిగా ఐఎఫ్ఎఫ్ఐ లో ఒక టెక్నాలజీ హబ్ కూడా ఏర్పాటు అయ్యింది ''అని మంత్రి వివరించారు.

ఐఎఫ్ఎఫ్ఐ విభిన్న అవకాశాలు అందిస్తుందని శ్రీ ఠాకూర్ అన్నారు. చలన చిత్ర రంగం, మీడియా, వినోద రంగాల్లో పనిచేస్తూ ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన మహిళలను ఐఎఫ్ఎఫ్ఐ గుర్తించి గౌరవిస్తుందని శ్రీ ఠాకూర్ అన్నారు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగిన మహిళలు తమ నైపుణ్యాలను ఐఎఫ్ఎఫ్ఐ వేదికగా ప్రదర్శిస్తారన్న ఆశాభావాన్ని శ్రీ ఠాకూర్ వ్యక్తం చేశారు. ఐఎఫ్ఎఫ్ఐ మహిళా దర్శకులు, రచయిత్రులు, నటీమణులు, కళాకారులకు ప్రత్యేక స్థానం కల్పించి ప్రోత్సహిస్తుందని శ్రీ ఠాకూర్ హామీ ఇచ్చారు.

చిత్రోత్సవాలను అన్ని వర్గాలు అందుబాటులో తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీ ఠాకూర్ వివరించారు. దీనిలో భాగంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. దివ్యాంగుల ప్రత్యేక అవసరాలు దృష్టిలో ఉంచుకుని దృశ్య శ్రవణ విధానంలో చిత్రాలు ప్రదర్శిస్తారని శ్రీ ఠాకూర్ తెలిపారు. స్మార్ట్ ఫోన్ ఫిల్మ్ మేకింగ్, స్క్రీన్ యాక్టింగ్ అంశాల్లో దివ్యాంగుల కోసం ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రత్యేక కోర్సులు ప్రారంభిస్తుందని శ్రీ ఠాకూర్ ప్రకటించారు.

# తెలుగు రాష్ట్రాలలో పడిపోయిన ఉష్ణోగ్రతలు..

హైదరాబాద్, నవంబర్ 21: తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. కొన్ని జిల్లాల్లో సింగిల్ డిజిట్‌కు సైతం పడిపోయాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు గజగజ వణుకుతున్నారు. ఉదయం 10 గంటల వరకు పొగమంచు కప్పుకునే ఉంటుంది. పొగమంచు కారణంగా కొన్ని కోట్ల రోడ్డు ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణ విషయానికి వస్తే ముఖ్యంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 8.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు కొమురంభీం జిల్లాలో 11, మంచిర్యాల 12, ఆదిలాబాద్ 13, నిర్మల్ 13.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. అల్లూరి జిల్లా మినుములూరులో 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఏపీ విషయానికి వస్తే.. పాడేరు 12, అరకులోయలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే పరిస్థితి ఉన్నట్లు కనిపిస్తోంది. అటవీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న జిల్లాలో ప్రజల బాధలు వర్ణనాతీ తంగా మారాయి. చలి మంటలు వేసుకుని కాచుకుంటున్నారు. మొత్తం మీద తెలుగు రాష్ట్రాలపై చలి పంజా విసురుతుంది. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ముదిరాజుల వన సమారాధన మహోత్సవం




ఖమ్మం, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం చెరుకురి వారి తోటలో నిర్వహించిన ముదిరాజ్ సంఘం కార్తీక మాస వన సమారాధన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. దోరెపల్లి శ్వేత కార్పొరేటర్ ఆద్వర్యంలో ఈ కార్యక్రమం ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో గణంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ముదిరాజులకు మంచి స్థానం కల్పిస్తానని త్వరలో రాజకీయంగా మంచి పదవి ఇస్తానని మంత్రి తెలిపారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దొరేపల్లి శ్వేత అంబర్ పేట శంకర్ కి శాలువాతో సత్కరించారు. ముదిరాజ్ సంఘం కార్తీక వన సమారాధనలో సంఘం నాయకులు అంబర్ పేట శంకర్ తో కలిసి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల నాగేశ్వరరావు, కాశబోయిన అనంతరాములు, పగడాల మల్లేష్, మేడారపు వెంకటేశ్వర్లు, బుడిగం శ్రీనివాస్, వాలబోయిన వెంకటేశ్వర్లు, నార్ల మాల్సూర్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ అధినేత చంద్రబాబుపై తమ్ముళ్ళ ఒత్తిడి

## -వచ్చే ఎన్నికలకు సంబంధించి టికెట్లు ఇప్పుడే ప్రకటించాలని డిమాండ్

అమరావతి నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );టీడీపీ అధినేత చంద్రబాబుపై మరో ఒత్తిడి పెరిగింది. వచ్చే ఎన్నికలకు సంబంధించి టికెట్లు ఇప్పుడు ప్రకటించాలని టీడీపీ సీనియర్లు చంద్రబాబుపై ఒత్తిడి పెంచేశారు. ఎన్నికలకు ఏడాది ముందైనా టికెట్ల వ్యవహారం తేల్చేయాలని సీనియర్ నాయకుడు మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు చంద్రబాబును డిమాండ్ చేసినంత పనిచేశారు. అంతేకాదు..పనిచేయకపోతే తనకు కూడా టికెట్ వద్దంటూ.. బాబు మనసులో మాటను తెలుసుకునే వ్యూహంతోముందుకు సాగారు.తాజాగా జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆద్యంతం చంద్రబాబు నుంచి నేతల వరకు కూడా సీరియస్గానే కొన్ని విషయాలపై చర్చ జరిగింది. ఈ క్రమంలో యనమల సహా అయ్యన్న వరకు కూడా టికెట్ల అంశాన్ని ప్రస్తావించారు. అయితే గత ఎన్నికల్లో గెలిచినవారు మాత్రం సైలెంట్గా ఉంటే.. ఓడిపోయిన నాయకులు మాత్రం టికెట్లపై డిమాండ్ తెరమీదికి తీసుకురావడం గమనార్హం.దీంతో చంద్రబాబుకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. అయితే నాయకుల అసలు విషయా న్ని కూడా చెప్పారు. ''మీరు ఏమైనా అనుకోండి. మీడియా లేదుకాబట్టి.. ఇక్కడే చెబుతున్నా.వచ్చే ఎన్నికలకు సంబంధించి మీరు టికెట్లు కన్ఫర్మ్ చేయడానికి టైం తీసుకుంటే మనోళ్లు దారులు వెతుక్కనే పనిలో ఉన్నారు. మీరు నన్ను ఏమన్నా ఫర్వాలేదు. వాస్తవం ఇదే" అని అయ్యన్న కుండబద్దలు కొట్టారు.

ఇక మరో ఇద్దరు నేతలు అవుననే అన్నారు. ఇప్పటికీ చాలా మంది నాయకులు చంద్రబాబు ఎంత చెబుతున్నా.. యాక్టివ్ కాలేకపోతున్నారు. అంతేకాదు కార్యక్రమాలకు కూడా దూరంగా ఉన్నారు. దీనికి కారణం తమకు టికెట్ వస్తుందోరాదో అనే బెంగ వల్లే.. అని చెప్పారు.

పైగా వారు ఏమాత్రం అవకాశం చిక్కినా.. జనసేన లోకో.. మరో పార్టీలోకో జంప్ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇలాంటివారిని కాపాడుకునేందుకు ఒక అడుగు ముందుకు వేయాల్సిన అవసరం ఉందనేది నేతల మాట. మరి బాబు ఏం చేస్తారో చూడాలి.

# వైభవంగా పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



తిరుచానూరు, నవంబర్ 21: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు కన్నులపండువగా జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు ఉదయం మిథున లగ్నంలో అర్చకులు వేదమంత్రోచ్ఛారణ మధ్య ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం గజపటాన్ని ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా ధ్వజారోహణ మంటపానికి తీసుకొచ్చారు. కంకణభట్టార్ మణికంఠ బట్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ , కరోనా కారణంగా రెండు సంవత్సరాల తర్వాత అమ్మవారి వాహన సేవలు బయట నిర్వహిస్తున్నామన్నారు.

బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాటు- చేసినట్లు- చెప్పారు. ఉదయం, సాయంత్రం వాహన సేవలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో దంపతులతో పాటు- , జెఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డెప్యూటీ- ఈవో లోకనాథం, పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, తదితర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వాయుగుండంగా మారిన అల్పపీడనం.. రాగల 48 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు

అమరావతి: నవంబర్ 21:ఐఎండి సూచనల ప్రకారం నైరుతి మరియు ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలోని అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రస్తుతానికి వాయుగుండం జాఫ్నా (శ్రీలంక)కి తూర్పున 600 కి.మీ., కారైకాల్‌కు తూర్పు ఆగ్నేయంగా 630 కి.మీ., చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 670 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైందని అన్నారు. ఇది వాయుగుండం కొనసాగుతూ రాగల 48 గంటల్లో నెమ్మదిగా పశ్చిమ-వాయువ్య దిశగా తమిళనాడు మరియు దక్షిణకోస్తాంధ్ర తీరాల వైపు కదిలే అవకాశం ఉందని వివరించారు.

దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణకోస్తాలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో, రాయలసీమలోని చిత్తూరు, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, చాలా చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

మత్స్యకారులు మంగళవారం వరకు దక్షిణకోస్తా-తమిళనాడు తీరం వెంబడి వేటకు వెళ్లవద్దని సూచించారు. వర్షాల నేపధ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాయుగుండం దృష్ట్యా సంబంధిత జిల్లాల యంత్రాంగాన్ని ముందస్తు చర్యల కోసం అప్రమత్తం చేసినట్లు- విపత్తుల సంస్థ ఎండి బి.ఆర్ అంబేద్కర్ తెలిపారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం విపత్తుల సంస్థలో 24 గంటలు అందుబాటు-లో ఉండే 1070, 18004250101, 08632377118 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వర్షాల నేపధ్యంలో జిల్లా కలెక్టర్లను అలర్ట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించింది. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండరాదని, కరెంట్ పోల్స్‌కు దూరంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వెంట ఆదివారం నుంచి మంగళవారం వరకు గంటకు 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతున్న సమయంలో వాయుగుండం రైతాంగం కంటిపై కునుకులేకుండాచేస్తోంది. వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆదివారం చలితీవ్రత ఎక్కువైంది.

# కరోనా రోగి మృతి.. ఐదుగురు వైద్యులపై కేసు

లక్నో: నవంబర్ 21: ఒక యువకుడు కరోనాతో చనిపోయాడు. అయితే చికిత్స అందించడంలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల అతడు మరణించినట్లు యువకుడి కుటుంబం ఆరోపించింది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన ఐదుగురు వైద్యులపై కేసు నమోదైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నోయిడాలో ఈ సంఘటన జరిగింది. 2021లో దేశాన్ని వణికించిన కరోనా సెకండ్ వేవ్‌లో ఘజియాబాద్‌కు చెందిన 20 ఏళ్ల యువకుడు కరోనా బారిన పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడ్ని నోయిడాలోని ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. నెలన్నర రోజుల తర్వాత ఆసుపత్రి చికిత్సా విధానంపై అసంతృప్తితో ఢిల్లీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు చనిపోయాడు.

కాగా, ఆ యువకుడి మరణానికి నోయిడా ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణమని ఆ కుటుంబం ఆరోపించింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రెమెడిసివిర్ ఇంజెక్షన్లను ఆసుపత్రికి తామే కొనుగోలు చేసినప్పటికీ అతడికి ఇవ్వలేదని తెలిపింది. చికిత్సలో వైద్యుల నిర్లక్ష్యం వల్లనే ఆ యువకుడు చనిపోయినట్లు గౌతమ్ బుద్ధ్ నగర్ డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీకం సింగ్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో ఆయన నేతృత్వంలోని కమిటీ దీనిపై దర్యాప్తు జరిపింది. బాధిత కుటుంబం ఆరోపణలో వాస్తవం ఉన్నట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన ఐదుగురు వైద్యులపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304ఏ (నిర్లక్ష్యం వల్ల మరణానికి కారణం) కింద ఫేజ్ 2 పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

మరోవైపు తమ ఆసుపత్రిపై వచ్చిన ఆరోపణలను యాజమాన్యం ఖండించింది. యువకుడికి చికిత్స అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదని యథార్థ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కపిల్ త్యాగి తెలిపారు. కరోనా సోకిన యువకుడిని క్రిటికల్ కండీషన్‌లో తమ ఆసుపత్రికి తీసుకువచ్చారని, అర గంట ఆలస్యం అయినా అతడు బతికేవాడు కాదన్నారు. యువకుడి పరిస్థితి మెరుగవుతుండగా 35 రోజుల తర్వాత కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

కరోనా సెకండ్ వేవ్ పరిస్థితుల్లో తమ వైద్యులు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నించారని కపిల్ త్యాగి తెలిపారు. రిమెడిసివిర్ ఇంజెక్షన్ వల్ల కరోనా చికిత్సపై ఎలాంటి ప్రభావం ఉండదని పలు పరిశోధనల్లో తేలిందన్నారు. యువకుడ్ని ఆ కుటుంబం కోల్పోవడం చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు.

# ఆ నిర్ణయం లక్ష మందికి మేలు చేసింది : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 21: తాను తీసుకున్న ఒక్క నిర్ణయం లక్ష మంది నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో మేలు చేసిందని ఎంఆర్‌డీసీ చైర్మన్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలో యూఎల్‌సీ,రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించిన సందర్భంగా ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన సభ్యులు ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశంలో ఎమ్మెల్యేను సన్మానించారు.

ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్ నుంచి టీఆర్‌ఎస్ పార్టీలోకి మారడం వల్ల నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసమే పార్టీ మారినట్లు మరోసారి స్పష్టం చేశారు. కొందరు అధికారులు చేసిన తప్పిదం వల్ల ఎల్బీనగర్ నియోజకవర్గంలో యూఎల్‌సీ, రిజిస్ట్రేషన్ల సమస్యలు తలెత్తాయని తెలిపారు.

సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఎల్బీనగర్‌పై ప్రత్యే దృష్టి సారించి యూఎల్‌సీ, రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం చూపారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని వెల్లడించారు. మంత్రి కేటీఆర్ ఇచ్చిన జీవో నంబర్ 118 లో కొన్ని సవరణలు అనంతరం వచ్చే కొత్త జీవో విడుదల కాగానే తమ స్థలాలకు గజానికి రూ. 250 చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించారు. జీవో వల్ల ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 46 కాలనీల ప్రజలకు యూఎల్‌సీ, రిజిస్ట్రేషన్ల సమస్య నుంచి విముక్తి లభించిందని తెలిపారు.




# భారతదేశాన్ని సినిమాల చిత్రీకరణ.. అనంతర కార్యకలాపాలకు అత్యంత అభిలషణీయ గమ్యంగా మార్చాలి: శ్రీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, నవంబర్ 21:భారత దేశాన్ని చలనచిత్ర చిత్రీకరణ.. అనంతర కార్యకలాపాలకు అత్యంత అభిలషణీయ గమ్యంగా మార్చాలన్నదే తన స్వప్నమని కేంద్ర సమాచార-ప్రసారాలు-యువజన వ్యవహారాలు-క్రీడల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ అన్నారు. ఇందుకోసం మన ప్రజల, చలనచిత్ర పరిశ్రమ అగ్రగాముల-ఆవిష్కర్తల ప్రతిభ తోడ్పాటును ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గోవాలోని పణజి నగరంలో వెండితెర వెల్లువలు, స్ఫూర్తిదాయక ప్రసంగాలు, అద్భుత ప్రదర్శనలతో కూడిన 53వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాన్ని (ఇఫి-ఐఎఫ్ఎఫ్ఐ) ఆయన ప్రారంభించారు.

ఐఎఫ్ఎఫ్ఐ విషయంలో తన స్వప్నం ఒక వేడుకకే పరిమితం కాదని, అమృత మహోత్సవాల నుంచి అమృతకాలానికి మారిన తర్వాత భారతదేశం 100వ స్వాతంత్ర్య వార్షికోత్సవం నిర్వహించుకునే నాటి ఐఎఫ్ఎఫ్ఐ స్వరూపానికి సంబంధించినదని మంత్రి వివరించారు. "ప్రాంతీయ వేడుకల సంఖ్యను పెంచడం ద్వారా భారతదేశాన్ని ముఖ్యంగా ప్రాంతీయ సినిమాల రీత్యా సారాంశ సృష్టిలో తిరుగులేని శక్తిగా రూపొందించాలని వేం లక్ష్యంగా పెట్టుకున్నాం. నైపుణ్యంగల మన యువతలోని అపార సాంకేతిక ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ భారతదేశం ప్రపంచ నిర్మాణానంతర కార్యకలాపాల కూడలిగా మారే అవకాశాలు అపారం" అని ఆయన పేర్కొన్నారు.

ఆసియాలో అత్యంత ప్రాచీనమైన భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం 1952లో ప్రారంభమైన నాటినుంచే 'ఇఫి' దార్శనికత, విలువలు దాని ఇతివృత్తం 'వసుధైవ కుటుంబకం'లో అంతర్భాగంగా ఉన్నాయని శ్రీ అనురాగ్ ఠాకూర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమని శాంతియుత సహజీవన సారాన్ని ప్రబోధించే ఈ ఇతివృత్తాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. "ప్రపంచంలో భారతదేశం పాత్ర పెరుగుతుండటం, జి20 అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించనుండటం వంటివి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమర్థ నాయకత్వంలో నేతృత్వంలో 'ఒక భూమి-ఒక కుటుంబం-ఒకే భవిష్యత్తు' ఇతివృత్తం ఈ ప్రబోధం చుట్టూ తిరుగుతున్నది" అని ఆయన పేర్కొన్నారు.

"ఈ ఏడాది భారతీయ సినిమా ప్రదర్శనల సమాహారం (గాలా ప్రీమియర్స్ ఆఫ్ ఇండియన్ ఫిల్మ్స్), అంతర్జాతీయ చిత్రాలు, ఓటీటీ వేదికల నుంచి ప్రదర్శనలుంటాయి. అలాగే ప్రపంచవ్యాప్త ప్రశంసలు అందుకున్న 'ఫౌదా' నాలుగో సీజన్ ప్రీమియర్ కూడా ఒక భాగం. ఇక ఇజ్రాయెల్ చలనచిత్ర దిగ్గజాలు కూడా ఈసారి వేడుకలకు హాజరవుతున్నారు. ఈ ధారావాహిక తదుపరి సీజన్ కూడా 'ఇఫి'లో ప్రారంభించబడుతుంది" అని మంత్రి చెప్పారు.

ఈ ఏడాది 'సత్యజిత్ రే జీవన సాఫల్య పురస్కారం' గెలుచుకున్నందుకు ప్రముఖ స్పెయిన్ చిత్ర నిర్మాత 'కార్లోస్ సౌరా'ను మంత్రి అభినందించారు. అలాగే 'ఈ ఏటి మేటి భారత చలనచిత్ర దిగ్గజం' పురస్కారాన్ని తెలుగు చలనచిత్ర రంగంలో మెగాస్టార్‌గా ప్రముఖుడైన చిరంజీవికి ప్రదానం చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈసారి 'ఇఫి'లో మణిపురి చలనచిత్ర రంగం 50 సంవత్సరాల జ్ఞాపకార్థం ప్రసిద్ధ ఫీచర్, నాన్-ఫీచర్ మణిపురి చిత్రాల ప్రత్యేక ప్యాకేజీని ప్రదర్శిస్తుందని ఠాకూర్ చెప్పారు.

ఇఫి వేడుకల నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న 'ఫిల్మ్ బజార్' ప్రాముఖ్యాన్ని శ్రీ అనురాగ్ ఠాకూర్ వివరించారు. "ఫిల్మ్ బజార్ కింద తొలిసారిగా 'కంట్రీ పెవిలియన్'లను ఏర్పాటు చేసి, దీని పరిధిని విస్తరించింది. ఈ బజార్ 15వ సంచికలో ఏర్పాటుచేసిన 40కిపైగా పెవిలియన్ల సందర్శనకు మిమ్మల్నందర్నీ నేను ఆహ్వానిస్తున్నాను. సినిమా ప్రపంచం నుంచి సరికొత్త ఆవిష్కరణల ప్రదర్శన కోసం తొలిసారిగా ఈసారి 'ఇఫి'లో ఒక సాంకేతిక కూడలి ఏర్పాటు చేయబడింది" అని మంత్రి వెల్లడించారు.

ఈసారి 'ఇఫి' వేడుకలు మరింత సార్వజనీనం, అందరికీ అందుబాటయ్యేలా దివ్యాంగులకు ప్రదర్శనల కోసం ప్రత్యేక తెరలు ఏర్పాటు చేయబడ్డాయని మంత్రి చెప్పారురు. "వారి సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విభాగంలోని చలనచిత్రాల్లో దృశ్య-శ్రవణ వివరణలు, ఉపశీర్షికలు జోడించాం. మరోవైపు విభిన్న ప్రతిభావంతుల కోసం 'స్మార్ట్ ఫోన్ ఫిల్మ్ మేకింగ్' (వినికిడి లోపంగలవారు) 'స్క్రీన్ యాక్టింగ్' (వీల్‌చైర్ వినియోగదారులకు ప్రత్యేకం) అనే రెండు ప్రత్యేక కోర్సులను ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ప్రవేశపెట్టనుంది" అని ఆయన చెప్పారు.

# స్వర్గీయ వీరపనేని శివాజీ ఆశయ సాధనకు కృషి చేస్తా : మంత్రి ఎర్రబెల్లి




ములుగు , నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): పేద ప్రజల సంక్షేమానికి నిత్యం తపించి, సమాజ హితం కోరిన స్వర్గీయ వీరపనేని శివాజీ అభివృద్ధి ఆశయ సాధనకు కృషి చేస్తానని, గోవింద రావు పేట, ములుగును సమగ్రంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హామీ ఇచ్చారు. ములుగు జిల్లా, గోవింద రావు పేటలో నేడు స్వర్గీయ వీరపనేని శివాజీ గారి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. శివాజీ మీద ఉన్న అభిమానం, గోవింద రావు పేట ప్రజల మీద ఉన్న ప్రేమతో ఈరోజు ఈ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. మీ ఊరికి శివాజీ మంచి సేవ చేశారు. 75 సంవత్సరాల ఆయన పుట్టిన రోజు సందర్భంగా నేడు వారి విగ్రహ ఆవిష్కరణ చేసుకోవడం నాకు గర్వంగా ఉందన్నారు. ఎన్టీ రామారావు వరంగల్ వస్తున్నప్పుడు నేను అప్పుడు జిల్లా కన్వీనర్‌గా ఉన్నాను. అప్పటి నాయ కులం.. మేము పిల్లలం. రామారావు రాక సందర్భంగా ఏర్పాట్లు మా నుంచి కావడం లేదు.. మీరు ముందుండి చేయాలి అని రామారా వుని బాగా అబిమానించే శివాజీ ని అడిగితే ఒప్పుకున్నారు. ఆ రోజు 1982లో నాయకత్వం శివాజీ చేతిలో పెట్టాం. అప్పటి నుంచి ఆయన ఈ ప్రాంతం కోసం చాలా చేశారు. మొత్తం రాష్ట్రంలోనే 400 ఇండ్లు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామాంావుని ఒప్పించి కట్టించిన మహానుబ,ావుడు శివాజీ అన్నారు. అదేవిధంగా గోవింద రావు పేటను మండలం చేయించారు. నా రాజకీయ జీవితం లో ఇద్దరు ముఖ్యమంత్రులను నేను బాగా అభిమానిస్తాను. ఒకరు ఎన్టీ రామారావు, మరొకరు కేసిఆర్ అన్నా రు. పెన్షన్ ఇచ్చింది, 2 కిలోల బియ్యం ఇచ్చి, పేద ప్రజల సంక్షేమానికి రామా రావు కృషి చేశారు. రామారావు గోవి ంద రావు పేటను మండలం చేస్తే, సీఎం కేసిఆర్ ములుగును జిల్లా చేశా రు. అంతటితో ఆగక జిల్లాను సమగ్ర మగాభివృద్ధి చేశారు. ములుగు కు 550 కోట్ల రూపాయలతో 300 పడకల కట్టి మెడికల్ కాలేజీ నిర్మిం చారు. నేను సేవ చేయాలని ఇక్కడి పెద్దలు కోంతున్నారు. కాబట్టి శివాజీ పేరు మీద ఈ ఊరిలో సందు, సందుకు సిమెంట్ రోడ్లు వేయిస్తాను అన్నారు. ఆ తర్వాత మండలంలో , నియోజక వర్గంలో, జిల్లాలో వేయి స్తాను అని అమ్మ భాగ్యలక్ష్మి, తమ్ము ళ్లు రామకృష్ణ, రవికాంత్ లకు హామీ ఇస్తున్నాను.

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు : చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ, నవంబర్ 21: రాష్ట్రంలో గణనీయంగా మత్స్య సంపదను పెంపొందింప చేసి మత్స్యకార కుటుంబాల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నిపిందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మచిలి బజార్ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చేప పిల్లలను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ భద్రకాళి తటాకంలో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల తదుపరి నిన్న వడ్డేపల్లి, ఈరోజు భద్రకాళి చెరువుల్లో అధికారికంగా మళ్ళీ చేపల పెంపకాన్ని చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో నూతన నీటి వనరుల విస్తీర్ణం భారీగా పెరగడం, దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచితంగా చేప, రొయ్య పిల్లల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలతో రాష్ట్రంలో మత్స్య సంపద కూడా భారీగా పెరిగిందని వివరించారు. సంపదను సృష్టించాలి.. దానిని పేదలకు పంచాలనే ఆలోచనల మేరకు రాష్ట్రంలో పెరిగిన మత్స్య సంపదను ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి మత్స్యకారుడికి అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాకముందు చేపల పెంపకం కోసం మీరే డబ్బులు వెచ్చించి చేప పిల్లలు కొని తీసుకువచ్చి పెంపకం చేసేదని కానీ ఉద్యమ సమయంలో కుంటుపడ్డ కులవృత్తులను నిశితంగా గమనించిన ఆనాటి ఉద్యమ సారథి నేటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సారథ్యంలో రాష్ట్రంలోని అనేక చెరువుల మిషన్ కాకతీయ ద్వారా పూడికతీత తీసి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి,75% సబ్సిడీపై వ్యాపార వాహనాలను అందించి నేడు రాష్ట్రంలో గణనీయంగా మత్స్య సంపదను పెంపొందింప చేసి మత్స్యకార కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడం జరిగిందన్నారు. భద్రకాళి చెరువులో నేడు 6లక్షల రూపాయలతో దాదాపు 4 లక్షల చేప పిల్లల వితరణ చేయడం వల్ల రాబోయే కాలంలో దాదాపు 2 కోట్ల రూపాయల ఆదాయం లభించనుందన్నారు.

# కొత్తగా చేర్చుకొన్న ఉద్యోగులకు దాదాపు గా 71,000 నియామక పత్రాలను రోజ్ గార్ మేళాలో భాగంగా నవంబర్ 22వ తేదీ నాడు పంపిణీ చేయనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 21:రోజ్ గార్ మేళా లో భాగం గా, దాదాపు గా 71,000 నియామక పత్రాల ను కొత్త గా ఉద్యోగాల లోకి చేర్చుకొన్న వ్యక్తుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవంబర్ 22వ తేదీ న ఉదయం పూట పదిన్నర గంట ల వేళ కు వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యం ద్వారా పంపిణీ చేయనున్నారు.

ఉపాధి కల్పన కు అత్యంత అధిక ప్రాధాన్యాన్ని కట్టబెట్టాలన్న ప్రధాన మంత్రి నిబద్ధత ను నెరవేర్చే దిశ లో రోజ్ గార్ మేళా ఒక ముందడుగు గా ఉన్నది. రోజ్ గార్ మేళా ఉపాధి కల్పన ను పెంపొందింపచేయడం లో ఒక ఉత్ప్రేరకం గా పని చేయగలదన్న, యువతీ యువకుల కు వారి సశక్తీకరణ తో పాటు దేశాభివృద్ధి లో వారు పాలుపంచుకోవడానికి కూడాను సార్థక అవకాశాల ను కల్పిస్తుందన్న ఆశాభావం వ్యక్తం అవుతున్నది. ఇంతకు మునుపు అక్టోబరు లో జరిగిన రోజ్ గార్ మేళా లో, కొత్త గా ఉద్యోగాల లోకి చేర్చుకొన్న 75,000 మంది కి నియామక లేఖల ను అందజేయడమైంది.

కొత్త గా భర్తీ అయిన వ్యక్తుల కు నియామక పత్రాల ను దేశవ్యాప్తం గా (గుజరాత్ మరియు హిమాచల్ ప్రదేశ్ మినహా) మొత్తం 45 స్థానాల లో ఇవ్వడం జరుగుతుంది. ఇంతకు పూర్వం భర్తీ చేసిన ఉద్యోగాల కేటగిరీల కు అదనం గా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, నర్సులు, నర్సింగ్ ఆఫీసర్స్, వైద్యులు, ఫార్మసిస్టు లు, రేడియోగ్రాఫర్ లు, ఇంకా ఇతర సాంకేతిక మరియు పేరామెడికల్ పోస్టుల ను కూడా భర్తీ చేయడం జరుగుతున్నది. చెప్పుకోదగిన సంఖ్య లో ఉద్యోగాల ను హోం మంత్రిత్వ శాఖ ద్వారా కేంద్రీయ సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) కు చెందిన వేరు వేరు విభాగాల లో భర్తీ చేయడం జరుగుతోంది.కర్మయోగి ప్రారంభ మాడ్యూల్ ను కూడా ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ఈ మాడ్యూల్ ను వివిధ ప్రభుత్వ విభాగాల లో నూతనం గా నియామకం అయిన వారికి ఉద్దేశించినటువంటి ఒక ఆన్ లైన్ ఓరియంటేశన్ కోర్సు అని చెప్పవచ్చును. దీనిలో ప్రభుత్వ ఉద్యోగుల కు ప్రవర్తన సంహిత, పని ప్రదేశం లో పాటించవలసిన నైతిక ప్రమాణాలు, సజ్జనత్వం, మానవ వనరుల సంబంధి విధానాలు, ఇంకా ఇతర ప్రయోజనాలు, భత్యాల వంటివి ఉంటాయి. అవి కొత్త గా ఉద్యోగం లో చేరిన వారు పని ప్రదేశం లో అనుసరించవలసివున్న విధానాల కు అలవాటుపడే విధం గాను, కొత్త భూమికల లోకి సాఫీ గా మారిపోయే విధం గాను సాయపడుతాయి. వారికి వారి యొక్క జ్ఞానాన్ని, నైపుణ్యాల ను మరియు దక్షతల ను పెంపొందింప చేసుకోవడం కోసం తిణనీబినెజీతీఎజీఎనీణతి.ణనీల.తిని ప్లాట్ ఫార్మ్ లోని ఇతర కోర్సుల ను నేర్చుకొనే అవకాశాన్ని కూడా ఇవ్వడం జరుగుతుంది.

# దేశానికి దిక్సూచిగా తెలంగాణ: మంత్రి కొప్పుల



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణను సీఎం కేసీఆర్ దేశానికి దిక్సూచిగా, మోడల్ రాష్ట్రంగా అభివృద్ధి చేస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించే మాటను నిలబెట్టుకొని, వ్యవసాయరంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించామన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌తో కలిసి ఆయన వేములవాడ రాజన్నను దర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అత్యధికంగా ధాన్యం పండించే పంజాబ్‌ను కూడా మనం అధిగమించామని చెప్పారు. మూడు కోట్లకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తున్నామని వెల్లడించారు.

పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని, వేములవాడలో ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. సమైక్యాంధ్రలో నిర్లక్ష్యానికి గురైన ఆలయాలు ఇప్పుడు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. యాదాద్రి ఆలయాన్ని ఇప్పటికే అభివృద్ధి చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారని వెల్లడించారు. వేములవాడ, బాసర, ధర్మపురి, కాళేశ్వరం లాంటి ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యక్ష నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధి కృషి చేస్తుందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా ఇలా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరగడం లేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాలు, మున్సిపల్, గ్రామపంచాయతీలను కూడా ఏర్పాటు చేసి పరిపాలనను మరింత చేరువ చేశారన్నారు.

# ట్విట్టర్‌లోకి తిరిగి వచ్చేందుకు ఆసక్తి లేదు: ట్రంప్

న్యూఢిల్లీ, నవంబర్ 21: ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లోకి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. జీవితకాల నిషేధానికి గురైన ట్రంప్ ఖాతా.. 22 నెలల తర్వాత తిరిగి తెరచుకుంది. ట్విట్టర్ కొత్త బాస్ ఎలాన్ మస్క్.. పోల్ నిర్వహించి ట్రంప్ ఖాతాను పునరుద్ధరించారు. ఖాతా పునరుద్ధరణపై కంపెనీ మస్క్ నిర్వహించిన ఓటింగ్‌లో 51.8 శాతం మంది ట్రంప్‌కు అనుకూలంగా ఓటువేశారు. దీంతో మాజీ అధ్యక్షుడి ఖాతాను పునరుద్ధరిస్తున్నామని మస్క్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు.

అయితే ట్విటర్‌లో చేరనని గతంలోనే తేల్చిచెప్పిన ట్రంప్.. ఇపుడూ ఇదే విషయాన్ని చెప్పారు. ట్విట్టర్‌లోకి తిరిగి వచ్చేందుకు తనకు ఆసక్తి లేదన్నారు. ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ రూపొందించిన ట్రూత్ సోషల్ యాప్ అద్భుతంగా పనిచేస్తోందని.. తాను దానికే పరిమితమవుతానని చెప్పారు. తనను తిరిగి ట్విట్టర్‌లోకి ఆహ్వానించినందుకు ఎలాన్ మస్క్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

2021 జనవరిలో జరిగిన క్యాపిటల్ హిల్ దాడి తర్వాత ట్రంప్ అకౌంట్‌ను మైక్రోబ్లాగింగ్ వెబ్‌సైట్ బ్యాన్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ట్రూత్ సోషల్ యాప్ ద్వారా తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

# అంగరంగ వైభవంగా బొందిలి కులస్థుల వన భోజన కార్యక్రమం

నరసారావు పేట నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );"మహా రాణా ప్రతాప్ సింగ్ బొందిలి అన్న దాన సమాజ్" కమిటీ ఆధ్వర్యం లో నేడు బొందిలి కులస్థుల వనభోజన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎంపి అయోధ్య రామిరెడ్డి, ఎంఎల్ఏ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరైనారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "బొందిలి "కులానికి మరియు "సత్రానికి "ప్రభుత్వం నుండి అన్ని విధాలా సహాయ సహకారాలు వుంటాయని హామీ ఇచ్చారు .ఈ వన భోజన కార్యక్రమానికి నరసరావుపేట,పిట్టంబండ ,మార్కా పురం ,వినుకొండ ,బొందిలి పాలెం నడిగడ్డ ,చెట్టుపల్లి ,చిలకలూరిపేట ,గుంటూరు ,విజయవాడ ,నూజివీడు,కర్నూలు ,హైదరాబాద్ ,ఒంగోలు వూర్ల నుండి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేసారు .

కార్యక్రమం ఇంత విజయవంతంగా నిర్వహించడానికి ప్రత్యక్షంగా ,పరోక్షంగా రాష్ట్రం నలుమూలల నుండి సహాయ సహకారాలు అందించిన "బొందిలి"కులస్థులందరికి "మహా రాణా ప్రతాప్ సింగ్ బొందిలి అన్న దాన సమాజ్" కమిటీ తరుపున మహా రాణా ప్రతాప్ సింగ్ బొందిలి అన్న దాన సమాజ్ ప్రెసిడెంట్ కే.విజయ్ ప్రతాప్ సింగ్ పేరు పేరున ధన్యవాదాలు తెలియజేసారు.






# జవహర్ లాల్ నెహ్రూ స్కూల్లో బాలల దినోత్సవం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని జవహర్ లాల్ నెహ్రూ ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థినీ విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులుగా ఈరోజు విధులు నిర్వహించిన విద్యార్థులు మాట్లాడుతూ, ఈరోజు ఒక టీచరుగా క్లాసుకు వెళ్లి భోదించాలి అంటేనే ఎంతో భయం అనిపించింది. ఉపాధ్యాయులు మాకు క్రమశిక్షణతో పాటు విద్యాబుద్దులు నేర్పడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఇట్టి ఉపాధ్యాయవృత్తి అనేది దేవుడిచ్చిన వరం. అది ఎంత ఉన్నతమైనది, పవిత్రమైనది అనేది ఈరోజు మాకు తెలిసింది. ఏ వృత్తిలో లేని సంతృప్తి ఈ ఉపాధ్యాయ వృత్తిలో ఉందని తెలుసుకున్నాము. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మా పాదాభివందనం తెలియజేస్తున్నాము అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుగా కొండ శ్రీకాంత్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా అనిల్, శరణ్యప్రియ, ప్రణవి, విద్యాచరన్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ జండా -జాతి సంక్షేమమే ఏజండా

**– సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమా**



హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రపంచమస్త్యకారుల దినోత్సవం,తెలంగాణా ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణా ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యం లో సోమవారం సీతాఫల్ మండి లో ముదిరాజ్ మహాసభ జండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమా ముఖ్య అతిధిగా పాల్గొని జండాను ఎగుర వేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రము లోని ముదిరాజ్ లు ఐఖ్యతతో రాజకీయంగా ముందుకు వెళ్లి మన ఉనికిని చాటాలన్నారు. అనంతరం టిఎంఎంఎస్ రాష్ట్ర కార్య దర్శి దీపిక ముదిరాజ్ మాట్లాడుతూ పల్లె పల్లెన ముదిరాజ్ జండా –జాతి సంక్షేమమే మహా సభ ఏజండా నినాదం తో ముదిరాజ్ లు ముందుకు వెళ్ళాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ మహా సభ రాష్ట్ర నాయకులు శీలం సరస్వతి ముదిరాజ్,నిర్మల ముదిరాజ్, సతీష్ ముదిరాజ్,రాంబాబు ముదిరాజ్, అరుణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్‌ను పట్టణం ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సన్మానం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మూడోసారి సారి నియమితులైన పీర్ మహమ్మద్ ను సోమవారం వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రమ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అక్రంమాట్లాడుతూ. మరొక్కసారి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులు కావడం అభినందనీయమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అలాగేవేములవాడ మండల, పట్టణ ముస్లింల సౌకర్యార్థం ఉన్న షాదీఖానా మిగులు పనులను మరియు పట్టణంలోని ఈద్గా ఖబ్రస్తాన్ ప్రహరీ గోడ, పనులు పూర్తి చేయడానికి ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. పీర్ మహమ్మద్ మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న పనులు ఎమ్మెల్యే రమేష్ బాబు దృష్టికి తీసుకెళ్లి తొందరగా పనులు పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తనపై నమ్మకంతో మూడోసారి మార్కెట్ కమిటీగా నియమించినందుకు ఎమ్మెల్యే రమేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు పట్టణ ముస్లిం కమిటీ తనను సత్కరించడం ఆనందంగా ఉందని అన్నారు.

తనను సన్మానించినపట్టణ ముస్లిం కమిటీ సభ్యులకు పీర్ మహమ్మద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ రసూల్, కార్యదర్శి మహమ్మద్ వలీ,జాయింట్ క్యాషియర్ ఖాజా నయిముద్దిన్, మసీద్ అధ్యక్షులు షేక్ ఇమామ్, మహమ్మద్ సర్వర్, అబ్దుల్ రజాఖ్, మొహమ్మద్ బషీర్, తెరాస నాయకులు మహమ్మద్ సలీం, మహమ్మద్ బాబా,యం.ఏ రాహిల్, మొహమ్మద్ రఫఖ్, ముస్లిం కమిటీ సభ్యులు,నాయకులు మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం క్షేత్రస్థాయి నుండి జరగాలి

## –ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి.

## –జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, నవంబర్ 21 (నేటినిజం (ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ అర్జీలను సాధ్యమైనంత త్వరగా



పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం కలెక్టరేటులోని గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ( 15 ) ఫిర్యాదులు అందినవి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారుల తాకిడి చాలా తగ్గింది. అర్జీలను వెంటదివెంట పరిశీలన జరిపి ఆయా సమస్యల పరిష్కారంకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి వారం రోజులు ప్రతేక డ్రైవ్ చేపట్టడంతో మంచి ఫలితాలు వచ్చాయని,కోర్టు కేసులు, లిటిగేషన్, తదితర మినహా చేయగలిగిన అన్ని సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం క్షేత్రస్థాయి నుండి జరిగితే త్వరితగతిన పూర్తవుతాయని అన్నారు. మీ మీ శాఖల్లో కూడా క్షేత్రస్థాయి నుండి పరిష్కారం జరిగేలా చర్యలు తీసు కోవాలని అధికారులకు ఆదేశించారు. ఫ్లాగ్ షిప్ కార్యక్రమాలపై దృష్టి పెట్టగలిగితే అర్హులకు సజావుగా ఫలితాలు అందుతాయని అన్నారు. ఆసరా పెన్షన్స్ లో అర్హత గల వారు ఎవరైనా మిస్ అయితే వారిని గుర్తించి జాబితాను ప్రభుత్వా నికి పంపాలని డిఆర్డిఓ శ్రీనివాసరావుకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకి ఒక వరం.. ఎంపిపి ఈదురు రాజేశ్వరి.



మహబూబాబాద్, నవంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని చిట్యాల,వడ్డేకొత్తపల్లి గ్రామాలలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు , మాజీ శాసన సభ్యులు డాక్టర్ నెమ్మరుగొమ్ముల సుధాకర్ రావుల సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపిపి ఈదురు రాజేశ్వరి ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్ పంపిణీ చేయటం జరిగింది. ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని,పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకి ఒక వరం అని అన్నారు..

చిట్యాల గ్రామానికి చెందిన అనపురం యాకయ్య కు 60,000 ,శిరంశెట్టి వసంత 30,000,పల్లపు పిచ్చయ్య 25,000 తంగళ్ళపల్లి వినోద 22,500 రూపాయల చెక్కులను తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, కొల్లూరి రమేష్, రాపోలు సుదర్శన్, కొయ్యేడి యాకయ్య, లింగాల రమేష్, దేశెట్టి నారాయణ, ఆకుల వెంకన్న, ఈదురు సోమయ్య, ఈదురు రాములు, పిట్టల పద్మ,పాలవెల్లి లక్మి, యూత్ నాయకులు అనపురం అశోక్ రాపోలు దేవేందర్, పెందోటా యశ్వంత్, తాందూరి యాకయ్య, తదితరులు,వడ్డే కొత్తపల్లి గ్రామంలో తంగళ్ళపల్లి మల్లికార్జున చారి, ఉప సర్పంచ్ మొర్రిగడుదుల శ్రీనివాస్, తెరాస గ్రామ పార్టీ అధ్యక్షుడు కేశబోయిన కుమారస్వామి తెరాస నాయకులు, బొల్లు ఉషయ్య , కేశబోయిన రామరాజు, కేశబోయిన.యాకన్న, దంతాలపల్లి.ఎల్లయ్య, దంతాలపల్లి.జనార్దన్, పల్లె.కొమురమల్లు, కేశబోయిన.సుభాన్, బొల్లు.కుమారస్వామి, బొల్లు.సతీష్ తదితరులు పాల్గొన్నారు

# జాతీయస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచినవేములవాడ విద్యార్థులు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో సి ఎస్ కె ఐ కప్ 2022 మూడు రోజులపాటు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆదివారం వేములవాడకు చెందిన ఓ కినావ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చాటారు . కరాటే లో లోని క టాస్ కుమ్మితే వివిధ విభాగాల్లో సిహెచ్. సూర్య జై చందర్, వివేక శ్రీ, ఎస్. ఆర్య నందన్,శివ, బంగారు పతకాలు మణిదీప్, పి భార్గవ్, ఏనుగుల నిహాన్, ఏనుగుల అన్విత, గుంట అశ్విక వెండి పత కాలు, ఎండి రెహమాన్, పి వివేక్, మోక్షిత్, కన్వేష్, సిహెచ్ సూర్య జై చందర్, ఎస్ ఆర్య నందన్, వివేక శ్రీ, డి. నిహాన్, తాటిపాముల స్వేచ్ఛ హర్షిత్, రబ్బరి శరత్ కాంస్య పతకాలు సాధించినట్లు వేములవాడ ఓ కి నావ స్పోర్ట్స్ కరాటే స్కూల్ ఫౌండర్ అబ్దుల్ మన్నాన్ తెలిపారు.

విద్యార్థులు పతకాలుసాధించిన పట్ల జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షులు కొండ దేవయ్య, ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, కరాటే మాస్టర్లు అభినందించారు

# ఏరియా ఆసుపత్రిని సందర్శించిన మంత్రి కొప్పుల ఈశ్వర్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లోని వంద పడకల ఏరియా ఆసుపత్రిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబుతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు అందే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వేములవాడ 100 పడకల ఆస్పత్రిలో వైద్య సేవలు బేష్ గా ఉన్నాయని, మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నరోగులతో మంత్రి మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్ పెల్లి వినోద్ కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హనుమాన్లు, పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రావు, డాక్టర్స్, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

# మూడవసారి మార్కెట్ కమిటీ డైరెక్టర్గా ఫీర్ మహమ్మద్ ఎన్నిక పట్ల హర్షం

**– సిరిగిరి రామచంద్రం యువసేన ఆధ్వర్యంలో సన్మానం**



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మూడవసారి ఎన్నిక కాబడిన పీర్ మహమ్మద్ ను సోమవారం కౌన్సిలర్ సిరిగిరి రామచంద్రం యువసేన ఆధ్వర్యంలో శాలువా పూలమాల స్వీట్ తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడోసారి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మ

పీర్ మహమ్మద్ ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం తనను సన్మానించిన సిరిగిరి రామచంద్రం యువసేన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు బొల్లం దేవరాజ్, పిట్టల మధు, ఎలక్ట్రిషన్ మున్నర్తదితరులు పాల్గొన్నారు.

# కొబ్బరిచెట్ల పోషణ గురించిన స్ఫూర్తికి నిదర్శనంగా భారతీయ రైతుల యొక్క స్ఫూర్తిదాయకమైన కథనం




హైదరాబాద్, నవంబర్ 21: మారికో లిమిటెడ్ యొక్క ఫ్లాగ్‌షిప్ చొరవ పారాచూట్ కల్పవృక్ష ఫౌండేషన్ వారి సహజసిద్ధమైన వృద్ధి మరియు పోషణ స్ఫూర్తిని జరుపుకోవడం ద్వారా భారతదేశ వ్యవసాయ సంఘాలకు ప్రశంసలందించేందుకు బహుముఖ ప్రచారాన్ని ప్రారంభించింది.

ప్రింట్, డిజిటల్ మరియు సోషల్ మీడియా ఛానెల్‌లలో విస్తరించిన సమీకృత ప్రచారం, రైతుల పెంపకం స్ఫూర్తి గురించి వినియోగదారులకు అవగాహన కల్పించడమే కాకుండా, వారి నిరంతర ప్రయత్నాల కు కృతజ్ఞతలు తెలిపే లక్ష్యంతో ఒక యాడ్ ఫిల్మ్‌ను విడుదల చేసింది. మారికో ప్రతి రైతులో ఒక పెంపకం దారున్ని ఎలా చూస్తుందో యాడ్ ఫిల్మ్ వివరిస్తుంది. ఈ ప్రచారానికి ఐశ్వర్య లక్ష్మి, లక్ష్మి మంచు, కళ్యాణి ప్రియదర్శన్, శరత్‌కుమార్, అనుపమ పరమేశ్వరన్, సంయుక్త హోర్నాడ్ వంటి ప్రముఖ దక్షిణ భారత ప్రముఖులు మద్దతు ఇచ్చారు.

ఈ ప్రచారం ద్వారా వినియోగదారులను రైతు సమాజానికి మరింత చేరువ చేయాలని మారికో ఆకాంక్షిస్తుంది. అందువల్ల, ప్రచారం యొక్క రెండవ దశగా, పారాచూట్ అడ్వాన్స్‌డ్ గోల్డ్ ప్యాక్‌పై వారి నిజ జీవిత స్ఫూర్తిదాయక కథనాలను కలిగి ఉన్న ప్రత్యేక రైతు ఎడిషన్‌ను పారాచూట్ కల్పవృక్ష ఫౌండేషన్ ప్రారంభించింది. వినియోగదారులకు పోషణ స్ఫూర్తిని తెలియజేసేందుకు, ప్యాక్ సీడ్ పేపర్ నెక్ ట్యాగ్‌తో వస్తుంది, దీన్ని మట్టిలో విత్తినప్పుడు మరియు క్రమం తప్పకుండా నీరు పెట్టినప్పుడు మొక్కగా ఎదుగుతుంది.

మోతీ సింగ్ (ది ఫార్మింగ్ సోల్జర్), సందీప్ గీతే (ది డ్రాట్ వారియర్), అరవింద్ ఎ (ది ల్యాండ్స్ గార్డియన్) మరియు వినోద్ కుమార్ (నర్చరర్ ఆన్ డ్యూటీ) అనే నలుగురు రైతుల ప్రభావవంతమైన కథలకు ఈ ప్రత్యేక సంచిక ముందుమాటను ప్రదర్శిస్తుంది.

స్టోర్ అసెట్లలో పొందుపరిచిన ఖీఖీ కోడ్ వినియోగదా రులను వారి కుటుంబం, జీవితం మరియు దేశంలోని ప్రజలకు ఆహారం అందించడానికి వారు ఎదుర్కొన్న సవాళ్ల గురించి వివరణాత్మక కథనాన్ని అందించే మైక్రోసైట్‌కి దారి తీస్తుంది. మైక్రోసైట్ చొరవ మరియు దాని ప్రభావం గురించిన వివరాలను కూడా అందిస్తుంది. పరిమిత-ఎడిషన్ ప్యాక్‌లు ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్‌లో డిజిటల్‌గా విక్రయించబడతాయి. ఆఫ్‌లైన్ విక్రయాల కోసం బెంగుళూరు, చెన్నై, కొచ్చి, కోయంబత్తూర్, హైదరాబాద్ మరియు విజయవాడ వంటి నగరాల్లో రిలయన్స్ స్టోర్‌లతో ప్రత్యేకమైన టై-అప్ చేయబడింది.

**BEFORE THE COMMISIONER FOR EMPLOYEES WORKMEN COMPENSATIONER OF LABOUR IV, TWIN CITIEST.ANJAIAH BHAVAN,RTC X ROADS, AT:HYDERABAD.**
**E.C.NO.362 OF 2017**

BETWEEN:
S.Laxmamma and Another.
.....Appellant
AND
Kodi Swaroopa, W/o.Kodi Mallesham and another
......Opposite Parties

To,
Kodi Swaroopa, W/o.Kodi Mallesham, Occ:Owner of car bearing no.TS-07,E P-6669, R/o.H.No.4-2-676,Indira Nagar Colony, Vikarabad, Vikarabad dist.
...Opposite Parties

Please take notice that the above named applic ant filed W.C. against you and others for compensation praying that the Hon'Ble court for grant of compensation in favour of the petitio ners. The Hon'Ble court posted the above case on **8-12-2022** at 3 P.M. for your appearance either in person or through an advocate failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF THE COURT)
**A.MADHAVA REDDY**
Advocate
H.No.16-2-740,
Gaddiannaram,
Dilsukhnagar,
Hyderabad.

**IN THE COURT OF THE MACT CUM 12th. ADDL CHIEF JUDGE AT: SECUNDERABAD**
**O.P. No. 486 OF 2020**

Between:
M. Sunitha
.......PETITIONER
AND
1. M.Ranga Rao, S/o.Venkateswarlu, Major, Rider, R/o.Chemgees Khan peta, Kondaveedu, Guntur.
.. Respondent No.1.
2. G.ChinnaVeeraiah, S/o.Ramaiah, Major, Business, R/o.H.No.3-45, Pangulurivaripalem, Chilakaluripet, Guntur.522619
... Respondent No.2

**NOTICE**

Please take Notice that the Petitioner has filed the above O.P. No. 486/2020 for compensation against the respondent No.1 and 2, and the above O.P. is posted to **25-11-2022** at 10.30.A.M. for your appear ance either in person or through Advocate. If you are fail to appear on that day this case will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
Counsel for Petitioner
**G.ASWINI KUMAR**
**G.VENKAT NAGESEH**
ADVOCATES
H.No. 12-11-329
WARASIGUDA
SECUNDERABAD
CELL NO: 9848145873




Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.